thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 69 | జగిత్యాల | బుధవారం | 3 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఒక్క పరుగుతో ఐర్లాండ్ సంచలనం



11



# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

**ఈ నెలలోనే విద్యా, అటవీ, పోలీస్ శాఖల్లో నోటిఫికేషన్లు**

## ఇప్పటికే 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

## అద్దె ఇళ్ల బాధల నుంచి పేదలకు విముక్తి చేస్తాం

- విజన్-2047 లక్ష్యం దిశగా ముందడుగు
- ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు
- తొలి ఏడాదే రైతుల ఖాతాల్లో రూ. 22 వేల కోట్లు జమ
- మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు
- తెలంగాణలో రాచరికానికి, పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు
- పరేడ్ గ్రౌండ్స్ అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. ఈ నెలలోనే విద్యా, అటవీ, పోలీసు శాఖల్లో భారీగా ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తామని ప్రకటించారు. పదేళ్ల రాచరిక పాలనకు చరమగీతం పాడి, ప్రజాకాంక్షల ప్రభుత్వంగా ఏర్పడిన తమ పాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో మంగళవారం అత్యంత వైభవంగా జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. రైతులకు రుణ విముక్తి, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళల సాధికారత లక్ష్యంగా అడుగులు వేస్తూ.. విజన్-2047 దిశగా రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన ఉద్ఘాటించారు.



వివరాలు 2వ పేజీలో



# తెలంగాణ మీ అయ్య జాగీరా?

- రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించా
- కబ్జా చేసినట్లు తేలితే నా ఫామ్ హౌస్ ప్రభుత్వానికే రాసిస్తా
- స్థానిక నేతలపై విరుచుకుపడ్డ ఏపీ డిప్యూటీ సీఎం పవన్
- సభకు అనుమతి నిరాకరించిన హైకోర్టు.. ఇంట్లోనే ప్రెస్ మీట్

తెలంగాణలో జనసేన కచ్చితంగా పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుండబద్దలు కొట్టారు. నవ నిర్మాణ సభకు హైకోర్టు అనుమతి నిరాకరించడంతో.. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలోనే ఆయన విలేకరులతో మాట్లాడారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఆంధ్రా వారిని తిడుతూ ఇంకెన్నాళ్లు కాలక్షేపం చేస్తారని ఘాటుగా ప్రశ్నించారు. అంతకుముందు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

3



## పోరాట స్ఫూర్తికి తెలంగాణ ప్రతీక!

రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

ఎక్స్ వేదికగా ప్రత్యేక సందేశం



2




# ఇది ప్రజల జాగీరు.. మీ అయ్యది కాదు

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముందుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్

3



3

## 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డీజీ



## కాంగ్రెస్‌కు తిరుగు లేదు!

- వచ్చే ఎన్నికల్లో మాకు ప్రత్యర్థులే లేరు
- ధాన్యం కొనుగోళ్ల వైఫల్యం బీజేపీదే
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2వ పేజీలో

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి..

పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ ▪ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

3






## ఆర్అండ్‌బీలో 222 ఇంజనీర్ పోస్టులు

- నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- జూన్ 18 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 10 నుంచి రాత పరీక్షలు

## అమరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రం

- దశాబ్దాల పోరాటాలకు ప్రతీక మన రాష్ట్రం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్
- ఐటీ, ఫార్మా రంగాల్లో మనకు అంతర్జాతీయ గుర్తింపు
- లోక్ భవన్ లో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



## తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హార్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!



4

## భారత్‌లో ఎబోలా టెన్షన్

- ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం




4

## మరో రికార్డు దిశగా మోడీ

- 7 రోజుల్లో నెహ్రూ రికార్డుకు బ్రేక్
- అత్యధిక కాలం ప్రధానిగా కొత్త చరిత్ర
- 10న ఎన్డీఏ ముఖ్యమంత్రుల సమావేశం
- చంద్రబాబు ప్రవేశపెట్టనున్న తీర్మానం
- 9 వేల రోజుల పాలనా నాయకత్వానికి చేరువైన మోడీ



4

చురకలు


# పోరాట స్ఫూర్తికి తెలంగాణ ప్రతీక!

## రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

### ఎక్స్ వేదికగా ప్రత్యేక సందేశం పంచుకున్న ప్రధానమంత్రి

**న్యూఢిల్లీ, జూన్ 2 :** తెలంగాణ రాష్ట్ర పన్నెండవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేయడంలో భాగంగా.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానానికి, ప్రగతి పథానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి మద్దతునిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు తమ సృజనాత్మకతకు, వ్యాపార దృక్పథానికి ప్రసిద్ధులని కొనియాడారు. ఈ రాష్ట్రం ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గొప్ప చరిత్ర, వైభవోపేతమైన సంస్కృతిని కలిగి ఉందని ఉద్ఘాటించారు. వికసిత భారత్ అనే మన స్వప్నాన్ని సాకారం చేసే దిశగా తెలంగాణ అభివృద్ధి ప్రస్థానానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.



### దేశ కీర్తిని పెంచాలి..: అమిత్ షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విశిష్టమైన సంస్కృతి, అద్భుతమైన పారిశ్రామిక నైపుణ్యంతో దేశ గమనంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. తెలంగాణ ప్రజల ఉత్సాహభరితమైన సంస్కృతి, వారి అద్భుతమైన పారిశ్రామిక స్ఫూర్తితో రాష్ట్రం రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నతమైన ప్రగతి శిఖరాలను, సంపదను సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ రాష్ట్రం మరిన్ని ప్రగతి శిఖరాలను అధిరోహిస్తూ, భారతదేశ కీర్తి ప్రతిష్టలను మరింత గొప్పస్థాయికి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని, జై తెలంగాణ అంటూ తన సందేశాన్ని ముగించారు. కాగా, రెండు వేల పద్నాలుగు జూన్ రెండున ఆంధ్రప్రదేశ్ వాయువ్య ప్రాంతం నుండి విడిపోయి, సుదీర్ఘ ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగా భారతదేశంలో సరికొత్త రాష్ట్రంగా తెలంగాణ అవతరించిన సంగతిని ఈ సందర్భంగా జాతీయ మీడియా గుర్తుచేసింది.

# అమరుల త్యాగఫలమే తెలంగాణ

- దశాబ్దాల పోరాటాలకు ప్రతీక మన రాష్ట్రం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- ఐటీ, ఫార్మా రంగాల్లో మనకు అంతర్జాతీయ గుర్తింపు
- లోక్ భవన్ లో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, జూన్ 2:** అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్ భవన్ లో గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తిని ప్రస్తావిస్తూ.. జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని గవర్నర్ కొనియాడారు. వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునికీకరణ సమపాళ్లలో సాగుతూ సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని గవర్నర్ ఆకాంక్షించారు. వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

- ఈ నెలలోనే విద్యా, అటవీ, పోలీస్ శాఖల్లో నోటిఫికేషన్లు
- ఇప్పటికే 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- అద్దె ఇళ్ల బాధల నుంచి పేదలకు విముక్తి చేస్తాం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందడుగు
- రాచరికాన్ని సహించం.. తెలంగాణలో పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు
- పరేడ్ గ్రౌండ్స్ అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా విధులు అత్యుత్తమంగా నిర్వహించిన పలువురు పోలీసు అధికారులకు రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అని అన్నారు. గత ఆరు నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని, రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు ముఖ్యమంత్రి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజనీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్ ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత ఐదు నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని ఆరోపించారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామన్నారు. తొలి ఏడాదే రైతుల ఖాతాల్లో రూ. 22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ. 11,300 కోట్లు జమ చేశామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు రూ. 60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ. 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హనుమకొండలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు జాతీయ జెండా ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్ లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

# కాంగ్రెస్‌కు తిరుగు లేదు!

- వచ్చే ఎన్నికల్లో మాకు ప్రత్యర్థులే లేరు
- రాష్ట్ర అభివృద్ధికి కేబినెట్ అంతా ఒక్క జట్టుగా పనిచేస్తోంది
- ధాన్యం కొనుగోళ్ల వైఫల్యం బీజేపిదే
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూన్ 2:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రస్తుత మంత్రివర్గం ఒక జట్టులా అద్భుతంగా పనిచేస్తోందని తెలిపారు. అందరి లక్ష్యం రాష్ట్ర అభివృద్ధి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పని చేసే పార్టీలకు ఎలాంటి ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదన్నారు. అసెంబ్లీ, లోక్ సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తా చాటుకుందని గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించే అంశంపై సానుకూలంగా ఉన్నామన్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 150 కోట్ల నిధులను కేటాయిస్తోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు రూ. 10 లక్షల వరకు వైద్య బీమా కవరేజీ లభిస్తుందన్నారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కొత్తగా పది వేల పడకలను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం కూడా లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లపై కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం తప్పుబట్టారు. బీజేపి నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై ఆయన విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపి ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. దేశంలో మొదటి నుండి గోదాముల్లో స్టాక్ ఉంచడం నేరమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం అదానీ, అంబానీ లాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు గోదాములు పెట్టుకునేలా లబ్ధి చేకూర్చిందని ఆరోపించారు. ఇక్కడి బీజేపి నేతలు రాజకీయాలు మాట్లాడటం మానేసి, కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని డిప్యూటీ సీఎం గట్టిగా హితవు పలికారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఎస్ ఆర్) పై మీడియా దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటర్ల మ్యాపింగ్, అన్ మ్యాపింగ్ ప్రక్రియలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతుల మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు మీటర్లు పెట్టబోమని, ఉచిత విద్యుత్ అందించి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడమే భవిష్యత్తులో తమ విజయానికి నిదర్శనమన్నారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని, 2028లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులే ఎవరూ లేరని ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్అండ్‌బీలో 222 ఇంజనీర్ పోస్టులు

- నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- జూన్ 18 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 10 నుంచి రాత పరీక్షలు




**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిరుద్యోగులకు మరో కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. రోడ్లు, భవనాల శాఖలో మొత్తం 222 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ లో భాగంగా 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 19 ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూన్ 18 నుంచి ఆన్ లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏఈఈ పోస్టులకు జూలై 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా.. ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూలై 15 వరకు గడువు కల్పించారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ లో పేర్కొన్న అర్హతలు, వయోపరిమితి, ఇతర నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలను ఆగస్టు 10 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను తుది ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు కమిషన్ అధికారిక నోటిఫికేషన్ ను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# తెలంగాణ ఎవరి జాగీరు కాదు!

- ఆంధ్రా వాళ్లను తిడుతూ ఇంకెన్నాళ్లు కాలక్షేపం చేస్తారు?
- రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించా
- కబ్జా చేసినట్లు తేలితే నా ఫామ్ హౌస్ ప్రభుత్వానికే రాసిస్తా
- స్థానిక నేతలపై విరుచుకుపడ్డ ఏపీ డిప్యూటీ సీఎం పవన్
- సభకు అనుమతి నిరాకరించిన హైకోర్టు.. ఇంట్లోనే ప్రెస్ మీట్



**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు హైదరాబాద్ లో జనసేన తలపెట్టిన నవ నిర్మాణ సభకు హైకోర్టు అనుమతి నిరాకరించడంతో జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇంట్లోనే మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. తెలంగాణలో జనసేన కచ్చితంగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తనను ఎవరైనా బెదిరించాలని చూస్తే భయపడేది లేదని ఘాటుగా హెచ్చరించారు.

## నవ నిర్మాణ సభకు హైకోర్టు బ్రేక్..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ పేరుతో బహిరంగ సభ నిర్వహించాలని జనసేన భావించింది. భద్రత, ట్రాఫిక్ కారణాల దృష్ట్యా పోలీసులు అనుమతి నిరాకరించడంతో జనసేన నేతలు హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ వేశారు. సమయాభావం వల్ల ఇంత అకస్మాత్తుగా అత్యవసర విచారణ జరపలేమని న్యాయస్థానం ఆ పిటిషన్ ను కొట్టివేసింది. దీంతో సభకు బ్రేక్ పడింది. మరోవైపు పవన్ ఇంటి వద్దకు అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఎక్స్ లో శుభాకాంక్షలు..

అంతకుముందు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని దాశరథి కృష్ణమాచార్య పలికిన అక్షర సత్యం స్వేచ్ఛా గీతమై మోగిన రోజు ఇదని గుర్తుచేశారు. సకల జనుల సంకల్పం, అమరుల త్యాగాల రూపమే తెలంగాణ అని కొనియాడారు. జనసేన ఊపిరి పోసుకున్నది ఈ గడ్డపైనే అని, అణగారిన వర్గాల కోసం గళం వినిపించే తెగువ తెలంగాణ నేలకే ఉందని స్పష్టం చేశారు. ఐటీ, ఫార్మా, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ఆ అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.

## బెదిరిస్తే భయపడేది లేదు..

తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో జనసేన ఉంటుందని, ఇక్కడ కచ్చితంగా పోటీ చేస్తామని కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ఎవరి జాగీరు కాదని, తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని తేల్చి చెప్పారు. భయపడేవాడినే అయితే పార్టీ ఎందుకు పెడతానని ప్రశ్నించారు. తనకు తెలంగాణపై ఉన్న ప్రేమ రాజకీయాలకు అతీతమన్నారు. ఆంధ్రా వాళ్లను ఇంకెంత కాలం తిడుతూ కాలక్షేపం చేస్తారని స్థానిక నేతలను నిలదీశారు. తన ఫామ్ హౌస్ ను కబ్జా చేసి కట్టానని నిరూపిస్తే.. దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానని సవాల్ విసిరారు.

## విభజన తీరుకే వ్యతిరేకం..

తెలంగాణ ఏర్పాటుకు తాను ఎన్నడూ వ్యతిరేకం కాదని, పార్లమెంటు తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నాడు వ్యతిరేకించానని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే ఇప్పుడు రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా ఉన్నారని విమర్శించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే తొలి గళం వినిపించేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ప్రజాకవి గద్దర్ తో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందని, ఆయన బతికున్నప్పుడు ఇప్పుడు మాట్లాడుతున్న నేతలంతా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై తనకు పూర్తి గౌరవం ఉందన్నారు. ఒక రాజకీయ విశ్లేషకుడు తన గురించి తప్పుగా మాట్లాడటం వల్లే ఈ వివాదమంతా మొదలైందని ఆయన స్పష్టం చేశారు.

# ఇది ప్రజల జాగీరు.. మీ అయ్యది కాదు

- ఏపీ ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముందుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్




**హైదరాబాద్, జూన్ 2:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. "తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. మీ అయ్య జాగీరు కాదు" అంటూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై గాంధీభవన్ వేదికగా మంత్రి స్పందించారు. పవన్ కల్యాణ్ తెలంగాణకు వచ్చి ఏం పీకుతాడని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్ అని మంత్రి పొన్నం అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్ తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కల్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్ కు కారు కొనిచ్చానని చెప్పినందుకు ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. తమకు ఆంధ్రప్రదేశ్ లోనే దిక్కులేదని పవన్ చెప్పుకున్నాడని మంత్రి ఎద్దేవా చేశారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్లను తాము ఏమీ అనలేదని, కానీ తాము ఆంధ్రా వాళ్లను ఏమో అన్నట్లు పవన్ కల్యాణ్ అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి వివరించారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు పవన్ అయ్య జాగీరా అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం రెచ్చగొట్టడం కాదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. ఆయన వచ్చినా, పోయినా తమకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామమోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ ద్వంద్వ వైఖరికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయని విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో పవన్ కల్యాణ్ ది జనసేన పార్టీ అని.. తెలంగాణలో బీజేపీకి భజన సేన అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో నిరుద్యోగంపై కొట్లాడుతానని అన్న పవన్ కల్యాణ్ కు.. కేంద్ర ప్రభుత్వం కారణంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేపర్ లీక్ ఘటనలు కనిపించడం లేదా అని నిలదీశారు. ఒకవేళ కనిపించినా నిలబడి కొట్లాడటానికి కాళ్లు లేవా అంటూ ఘాటుగా స్పందించారు. "ఇది తెలంగాణ జాతి.. అమ్మలా ఆదరించడం తెలుసు.. తెలంగాణలో కుట్రలు చేస్తే అమ్మోరులా దహించడం కూడా తెలుసు" అంటూ పవన్ కు వార్నింగ్ ఇస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

- అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- ఢిల్లీలో తెలంగాణ అవరతణ వేడుకల్లో నితిన్ నబీ








**న్యూఢిల్లీ,జూన్ 2 :** తెలంగాణ అభివృద్ధి, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లాలన్నది బీజేపీ సంకల్పం' అని బిజెపి జాతాయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. పీఎం కిసాన్ యోజన ,ముద్ర లోన్లు, జన్ ధన్ ఖాతాలు అందించాం. మౌలిక వసతులు,రోడ్లు,రహదారులు,రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వికసిత భారత్ కావాలంటే వికసిత తెలంగాణ కావాలి. ఒక అవినీతి పరుడు చేతుల్లోంచి మరో అవినీతి పరుడి చేతుల్లోకి వెళ్ళింది. తెలంగాణ కలలను సాకారం చేస్తాం' అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలానే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ, అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఏర్పాటు చేశాం. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చాం. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తున్నా. అమరవీరుల కలలు కన్న రీతిలో ఇంకా రాష్ట్రం వెనుకబడి ఉంది. చిన్నమ్మ సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు అధికారంలో ఉన్నారు. రాష్ట అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో జార్ఖండ్ ఏర్పాటు కానివ్వం అన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నారు.



# 91 మంది ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష

## వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డీజీ

**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. దీంతో ప్రకటించిన ఖైదీలు జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల అవుతున్న వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

## పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ

## తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 2:** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ సన్మానం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్టాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.





# చమురు మంటల్లో సామాన్యుడు

## పెట్రో రేషనింగే ఏకైక మార్గమా?

చమురు మంటలు చల్లారేలా లేవు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు పెట్రో ధరలను పెంచేశారు. వాణిజ్య సిలిండర్ ధరలు అమాంతంగా పైకి ఎగబాకాయి. పెట్రో సంక్షోభం ఇంకెన్నాళ్లో తెలియదు. అంతర్జాతీయం గా ముడి చమురు ధరలు పెరగడంతో భారత్ లాంటి దేశాలకు గుదిబండగా మారింది. ధరల దాడి ఇప్పట్లో ఆగేలా లేదు. పొదుపు మంత్రం పాటించిన ప్రధాని మోడీ అన్నింటా విఫలం అవుతోంది. పొదుపు ప్రభుత్వంలో కానరావడం లేదు. ధరలను అదుపు చేసే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్రో ధరలతో అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పులు, పప్పులు మొదలుకుని అన్నీ పెరుగుతున్నాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటిపై సమీక్షించాల్సిన కేంద్రం మిన్నకుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినా, వాటి డిమాండ్ తగ్గడం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ పెట్రో, డీజిల్, గ్యాస్ అనివార్యం అయ్యింది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగడంతో వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడు వాటి డిమాండ్ తగ్గకపోగా ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది. దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. దీనిపై ఆర్‌బిఐ గానీ, కేంద్రం కానీ సమీక్షించి చర్యలకు ఉపక్రమించడం లేదు. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు దాటేసింది. ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అనివార్యంగా అనుసరిస్తున్నారు. ధరలు పెంయడం మినహా మిగతా చర్యలపై కేంద్రంలోని ఏ పాలకులు ఆలోచన చేయడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి వారి అవగాహన రాహిత్యం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పుడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలతో ధరలు పెంచేస్తున్నారు. సరఫరా తగ్గడం, అంతర్‌ఆజతీయంగా బ్యారెల్ ధరలు పెరగడంతో ఆ భారం ప్రజలపై నెట్టేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. పెట్రో కొరత ఏర్పడినప్పుడు విచ్చలవిడి వినయోగాన్ని అదుపు చేయాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. చమురు దిగుమతులు తగ్గినప్పుడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. అప్పుడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది 8 శాతం పెరుగుతుంది. పెట్రో ఉత్పత్తుల రేషనింగ్ ద్వారా సంపన్నుల వినిమయాన్ని అదుపు చేస్తే అప్పుడు వారి వినిమయం వేరే ఉత్పత్తులవైపు మరలుతుంది. ఉపాధి కూడా పెరగవచ్చు. అంతే కాదు, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోకుండా నిలబడతాయి. కేవలం సంపన్నుల వినిమయాన్ని మాత్రమే రేషనింగ్ ద్వారా అదుపు చేస్తే దానివల్లే పెట్రో వినిమయం అవసరమైన మోతాదు మేరకు తగ్గిపోతుందని కూడా చెప్పలేము. ఇది అందరికీ వర్తించాలి. ఇక్కడ మోడీ ప్రకటించిన పొదుపును అందరూ పాటించేలా తప్పనిసరి చేయాలి. పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం గాని, తద్వారా కోట్లాదిమంది ప్రజల మీద భారాలను మోపడం కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పెరగడానికి దోహదపడుతుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో, తక్కిన ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. పైగా వినియోగదారులే పెట్రో ధరల పెంపు భారాన్ని కూడా భరించవలసి వచ్చింది. దాంతో సర్వత్రా ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో కాలుష్యాన్ని కంట్రోల్ చేయడానికి వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు పెట్రోల్ కోసం కూడా ఇలా అంక్షలు విధించి ప్రజలను భాగస్వాములను చేయాలి. తగిన పద్ధతిలో కట్టుదిట్టంగా దానిని అమలు చేయడం సాధ్యమే. ఇలా చయడంతో పాటు, కాలర్ల అమ్మకాలనపైనా ఆంక్షలు విధించాలి. దీంతో పెట్రో ఆదాతో పాటు, కాలుష్యం కూడా తగ్గగలదు. ఎన్నో ప్రత్యామ్నాయ పద్దతులను అధ్యయనం చేయాల్సి ఉంది. అప్పుడే ధరల భారాన్ని ప్రజలపై పడకుండా చూడవచ్చు. నిల్వలు కరిగిపోకుండా చేయవచ్చు.

# మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు
- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హార్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!



**న్యూఢిల్లీ, జూన్ 2:** పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్)లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత విస్తృతం చేయడాన్ని నిరసిస్తూ.. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న దౌత్యపరమైన చర్చలను ఇరాన్ సోమవారం రద్దు చేసుకుంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'తస్నీమ్' ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు పూర్తిగా స్తంభించిపోవడంతో ఇరాన్ చర్చల బృందం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సదరు వార్తా సంస్థ పేర్కొంది. ఈ చర్చల నిలిపివేతపై ఇరాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. "లెబనాన్‌లో ఇజ్రాయెల్ నిరంతరం సాగిస్తున్న అకృత్యాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. కాల్పుల విరమణ ఒప్పందానికి లెబనాన్ అంశం ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ ఇప్పుడు లెబనాన్‌తో సహా అన్ని రంగాలలోనూ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. అందుకే మధ్యవర్తుల ద్వారా అమెరికాతో జరుపుతున్న చర్చలను, పత్రాల మార్పిడిని ఇరాన్ బృందం తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని తస్నీమ్ నివేదించింది. ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని, అలాగే గాజా, లెబనాన్‌లలో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయాలనే తమ డిమాండ్లు నెరవేరే వరకు అమెరికాతో దౌత్యపరమైన చర్చలను తిరిగి ప్రారంభించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ సోషల్ మీడియా వేదికగా అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు పెంచడం అంటే.. అమెరికాతో కుదిరిన విస్తృత కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనేది నిస్సందేహంగా లేబనాన్‌తో సహా అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఏదైనా ఒక రంగంలో దీనిని ఉల్లంఘిస్తే, అది అన్ని వైపులా ఉల్లంఘించినట్లే అవుతుంది. దీనివల్ల వచ్చే పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది." అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ పేర్కొన్నారు. అమెరికాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడంతో పాటు, ఇరాన్ తన కూటమి దేశాలతో కలిసి అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను పూర్తిగా స్తంభించిపోయేలా చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రకటించింది. దీనితో పాటు ఎర్రసముద్రంలోని 'బాబ్ ఎల్ మండేబ్'జలసంధి లోనూ ఇతర వ్యూహాత్మక పంథాలను అస్త్రాలుగా మార్చి, ఇజ్రాయెల్ మరియు దానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఆర్థికంగా, సైనికంగా 'శిక్షించాలని' ఇరాన్ కూటమి నిర్ణయించింది. గాజా, లేబనాన్‌లలో ఇజ్రాయెల్ క్రూరమైన ఆర్మీ ఆపరేషన్లను తక్షణమే ఆపాలని, లేదంటే ఈ ప్రతిఘటన మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ చమురు సరఫరాకు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌లో ఎబోలా టెన్షన్

**ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి**

**అప్రమత్తమైన భారత ప్రభుత్వం**




**న్యూఢిల్లీ, జూన్ 2:** కెంగో, ఉగాండా తదితర ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలాలోని అత్యంత ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ వేగంగా వ్యాపిస్తుండటంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా గైడ్‌లైన్స్ జారీ చేసింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులను కోరినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక ప్రకటన ద్వారా చెప్పింది. తాజా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మే 17, 2026న ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్' గా ప్రకటించింది. అలాగే ఆఫ్రికా సీడీసీ సైతం దీనిని ఖండాంతర భద్రతా ముప్పుగా పరిగణించిందని 'ద హిందూ' పత్రిక తన నివేదికలో తెలిపింది. ఈ ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మే చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విమానాశ్రయాల్లో పటిష్టమైన స్క్రీనింగ్, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎబోలా (బుండిబుగ్యో స్ట్రెయిన్) కేసులు ఏవీ నమోదు కాలేదనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముందస్తు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి చేశారు. గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించి వచ్చిన వారు కచ్చితంగా స్వీయ నిర్బంధంలో ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ గట్టిగా సూచించింది. ఒకవేళ ఆ ప్రయాణికులలో అకస్మాత్తుగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు, లేదా శరీరంలో ఎక్కడినుంచైనా అకారణంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. సాయం కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1075' కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని ది హిందూ రిపోర్ట్ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పంపింది. ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పరీక్షల కోసం ల్యాబొరేటరీలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. విమానాశ్రయంలో ఎవరైనా అనుమానిత రోగులు గుర్తిస్తే వెంటనే వారిని ప్రత్యేక అంబులెన్సుల ద్వారా ఐసోలేషన్ సెంటర్లకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

# మరో రికార్డు దిశగా మోడీ

- 7 రోజుల్లో నెహ్రూ రికార్డుకు బ్రేక్
- వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా కొత్త చరిత్ర
- జూన్ 10న ఎన్డీఏ ముఖ్యమంత్రుల సమావేశం
- చంద్రబాబు ప్రవేశపెట్టనున్న ప్రత్యేక తీర్మానం
- 9 వేల రోజుల పాలనా నాయకత్వానికి చేరువైన మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 2:** ప్రధాని నరేంద్ర మోడీ మరో చారిత్రాత్మక మైలురాయికి చేరువయ్యారు. మరో ఏడు రోజుల్లో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన రికార్డును అధిగమించనున్నారు. జూన్ 9 నాటికి మోడీ వరుసగా 4,398 రోజులు ప్రధానిగా కొనసాగి కొత్త రికార్డును నమోదు చేయనున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ 1952 మే 13న తొలి లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత 1964 మే 27 వరకు వరుసగా 4,397 రోజుల పాటు ప్రధానిగా కొనసాగారు. ఇప్పుడు అదే రికార్డును మోడీ అధిగమించబోతున్నారు. 2014 మే 26న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ, 2019లో రెండోసారి, 2024లో మూడోసారి వరుస విజయాలు సాధించి పదవిలో కొనసాగుతున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా జూన్ 10న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, మిత్రపక్షాల నేతల సమావేశం నిర్వహించేందుకు కూటమి సిద్ధమవుతోంది. మోడీ నాయకత్వంలో దేశం సాధించిన పురోగతి, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కీలక కార్యక్రమాలను ప్రశంసిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానిగా మోడీ ఇప్పటికే అనేక రికార్డులను సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం పదవిలో కొనసాగిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా చరిత్ర సృష్టించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ పేరిట ఉన్న 2,272 రోజుల రికార్డును కూడా గతంలోనే అధిగమించారు. అలాగే వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా నిలిచారు. మోడీ రాజకీయ జీవితంలో మరో విశేషం కూడా ఉంది. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 2014 మే వరకు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికైన ప్రభుత్వాలకు నిరంతరాయంగా నాయకత్వం వహిస్తూ సుమారు 9 వేల రోజుల పాలనా అనుభవాన్ని నమోదు చేశారు. దేశ రాజకీయ చరిత్రలో ఎన్నికైన ప్రభుత్వాలకు ఇంత సుదీర్ఘ కాలం నిరంతరాయంగా నాయకత్వం వహించిన నేతగా మోడీ కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# సీబీఎస్ఈ అన్ స్క్రీన్ మార్కింగ్ వివాదం

**న్యూఢిల్లీ, జూన్ 2:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆన్–స్క్రీన్ మార్కింగ్ కు సంబంధించిన వివాదం మరింత ముదురుతోంది. కోఎంప్ట్ ఎడ్యుటెక్ సంస్థకు కాంట్రాక్ట్ కేటాయించిన విధానంపై సీబీఎస్ఈ నుంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పూర్తి నివేదిక కోరింది. ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కోఎంప్ట్ కు కాంట్రాక్టును కేటాయించేటప్పుడు అనుసరించిన విధానాలు, నిర్ణయం తీసుకునే పక్రియలో పాల్గొన్న అధికారులతో సహా, టెండర్ పక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీబీఎస్ఈని మంత్రిత్వ శాఖ కోరింది. తొలిసారిగా అమలు చేసిన ఆన్–స్క్రీన్ మార్కింగ్ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వేల ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సమాధాన పత్రాలు సరిగా స్కాన్ కాకపోవడం, పేజీలు కనిపించకపోవడం, మార్కుల లెక్కల్లో పొరపాట్లు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని వేల జవాబు పత్రాలను తిరిగి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాల్సి వచ్చింది . వివాదం రాజకీయ రంగు కూడా పులుముకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు (అఃౣఇ బిెనిటెస ఇనీనిబిసనీలెసబా). ఓఎస్ఎమ్ టెండర్ పక్రియలో మార్పులు చేసి కోఎంప్ట్‌కు అనుకూలంగా నిబంధనలను సడలించారని ఆరోపించారు. టెండర్ నిబంధనల్లో పలు మార్పులు జరిగాయని, దీంతో సంస్థకు అర్హత లభించిందని ఆయన పేర్కొన్నారు.

చురకలు



## విద్యార్థులు మాస్టర్ మైండ్స్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్:** జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గత 4 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ గూగుల్ మీట్ ఆన్లైన్ తరగతులను 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో మాస్టర్ మైండ్స్ ఆన్లైన్ తరగతుల సమన్వయకర్తలు, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, ధర్మపురి వెంకటేశ్వర్లు లతో కలిసి మాస్టర్ మైండ్స్ ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 4.45 గంటల నుండి నిర్వహిస్తున్న ఆన్లైన్ తరగతులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. ఈ నెల 11 నుండి ఆన్లైన్ తరగతులు ప్రారంభించడం జరుగుతుందని, జిల్లాలోని 10వ తరగతి విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకొని వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు,బాలకృష్ణ, స్వప్న రాణి, సాలం బిన్ అహ్మద్, భార్గవి, తారాబాయి, భాగ్యలక్ష్మి , ఆత్రం కృష్ణమ్మ , దూడల లక్ష్మి, కస్తూరి పుష్పలత, జి నాగు బాయి, జేబా షేక్, మాజీ ఏఎంసీ చైర్మన్ గాదివేని మల్లేష్, మేనేజర్ సర్వర్, బీ ఆర్ ఎస్ నాయకులు అశోక్, సాయి శ్రావణ్, కాంగ్రెస్ నాయకుడు షఫీ , మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు సబ్ డివిజన్ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కల్లూరు సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రగతిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రాష్ట్ర సాధించిన విజయాలు, అభివృద్ధి ప్రగతిని గుర్తు చేసుకుంటూ వేడుకలను నిర్వహించారు.

## షబ్బీర్ అలీకి స్వాగతం పలికిన డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్



**ఆదిలాబాద్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మంగళవారం ఆదిలాబాద్కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పెన్గంగా గెస్ట్ హౌస్లో ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాకు విచ్చేసిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఈ సందర్భంగా నాయకులు చర్చించారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై కోవ లక్ష్మి ఫైర్

- సమస్యలు దృష్టికి తీసుకువెళ్తానని అవకాశం ఇవ్వలేరు
- సీఎం జవాబు ఏం చెప్పాలో తెలియకనే అవకాశం ఇవ్వలేదు
- ఆదివాసి ఎమ్మెల్యే ను అవమానించడం దారుణం



**ఆసిఫాబాద్ టౌన్:** సభకు అధ్యక్షత వహించాల్సిన నన్నే మాట్లాడనివ్వకుండా అవమానించారు. ఒక ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేపై ముఖ్యమంత్రి చూపిన ఈ వైఖరి అత్యంత బాధాకరం అని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదే మాట్లాడారు. సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ప్రోటోకాల్ను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. సభ సాక్షిగా సమస్యలు లేవనెత్తితే ఏం జవాబు చెప్పాలో అర్థం కాకనే సీఎం నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. జిల్లా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే అడ్డుకున్నారని, ఇది తనను మాత్రమే కాకుండా మొత్తం ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. నేను ఆరు గ్యారెంటీల గురించి అడగడానికి వెళ్లలేదు. మా ప్రజల కష్టాలు చెప్పడానికి వెళ్లాను. గుండి బ్రిడ్జి, లక్మాపూర్ బ్రిడ్జి, వట్టివాగు ప్రాజెక్టు, కేబీ ప్రాజెక్టు, మెడికల్ కాలేజీ, తాగునీటి సమస్యలు, రోడ్ల దుస్థితి గురించి మాట్లాడాలని అనుకున్నాను. కానీ మాట్లాడనివ్వలేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.మెడికల్ కాలేజీలో 116 పోస్టులు ఉంటే కేవలం 12 పోస్టులే భర్తీ చేశారు. 300 పడకల ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. గ్రామాల్లో తాగునీరు లేదు. ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అటవీ శాఖ అనుమతుల పేరుతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఇవన్నీ చెప్పాలనుకుంటే అవకాశం ఇవ్వలేదు" అని విమర్శించారు.కాంగ్రెస్ నాయకుల పై కూడా ఆమె తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తే స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యలు ఎందుకు చెప్పడం లేదు? ప్రజల ఇబ్బందులు చెప్పాల్సిన వారు చప్పట్లు కొట్టడానికే పరిమితమయ్యారు" అని వ్యాఖ్యానించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రశ్నలు లేవనెత్తిన ఆమె, "వేల ఇళ్లు మంజూరు చేశామని చెబుతున్నారు. కానీ ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి? పూర్తి చేసిన వారికి డబ్బులు అందాయా? ప్రజాపాలన అంటున్నారు, ఇందిరమ్మ రాజ్యం అంటున్నారు. అసలు ఆ రాజ్యం ఎక్కడ ఉంది?" అని నిలదీశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హామీలపై కూడా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. "మహిళలకు నెలకు రూ.2,500 ఎక్కడ? గ్యాస్ సబ్సిడీ ఎక్కడ? తులం బంగారం ఎక్కడ? ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కనీసం రూ.100 కోట్ల నిధులు ప్రకటిస్తారని ఆశించాం. కానీ సభ పెట్టి ప్రచారం చేసుకోవడం తప్ప జిల్లాకు ఒరిగిందేమీ లేదు. ప్రజాధనంతో భారీ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదు" అని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ, జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు ఖర్చు చేశారు. గుస్సాడి కళాకారుడు కనకరాజుకు ఇల్లు, కోటి రూపాయల నగదు ఇచ్చారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం మూడు సంవత్సరాల్లో జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి అని సవాల్ విసిరారు. సీఎం నన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా చూశారా, ఆదివాసీ మహిళగా చూశారా తెలియదు. కానీ సభకు అధ్యక్షత వహించాల్సిన నన్నే మాట్లాడనివ్వకపోవడం అత్యంత అవమానకరం. ప్రజా సమస్యలు చెప్పే అవకాశం కూడా లేకపోతే అలాంటి పదవులు ఎందుకు? అందుకే బాధతో సభ మధ్యలో నుంచి వెళ్లిపోయాను" అని కోవ లక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చివరగా, ప్రజల కోసం పోరాడటం ఆపను. జిల్లా సమస్యల పరిష్కారం కోసం ఎంతవరకైనా వెళ్తాను. బీఆర్ఎస్తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుంది అని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగల్ విండో చైర్మన్ అలి బిన్ హైమద్, సర్పంచ్ పోచయ్య, ఉప సర్పంచ్ లక్ష్మి, కౌన్సిలర్లు బాలకృష్ణ, నాగుబాయ్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, టౌన్ అధ్యక్షుడు హైమద్, నాయకులు ని సార్ ,అశోక్ , సాయి, కాసిం ,రవి, రాజ్ కుమార్ , అన్సార్ , నారాయణ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి





**ఆసిఫాబాద్:** జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టీకానంద్, గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ, జిల్లాలోని మెజారిటీ గురుకులాలు, హాస్టళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతూ కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రెబ్బెన ఎస్సీ బాలికల గురుకులంలో ఒకే గదిలో 80 మంది విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఉందని, వర్షం వస్తే గదులన్నీ తడిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తిర్యాని ఎస్టీ గురుకులంలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని, ఆశ్రమ పాఠశాలల్లో కిటికీలు, దోమతెరలు, ఫ్యాన్లు, డార్మిటరీలు లేక విద్యార్థులు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, బీసీ వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయని, బీసీ బాలికల హాస్టల్, ఆసిఫాబాద్ కేజీబీవీ ఇంటర్మీడియట్ సొంత భవనాల నిర్మాణాలు పూర్తి దశకు చేరినా వాటిని ప్రారంభించడంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మరోవైపు జిల్లాలో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఆ భూములను కాపాడి విద్యార్థుల వసతి గృహాల నిర్మాణాలకు కేటాయించాలని కోరారు. కొత్త విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, అద్దె భవనాల్లో ఉన్న పాఠశాలలకు సొంత స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ జిల్లాపై సీఎం ప్రత్యేక దృష్టి

- సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఆసిఫాబాద్ టౌన్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటన, కొత్తగూడ–కొఠారి గ్రామంలో నిర్వహించిన సామూహిక గృహప్రవేశ కార్యక్రమం, రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుల ప్రారంభోత్సవం , భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు అధికార యంత్రాంగానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేశారని పేర్కొన్నారు. భారీ ఎత్తున సభకు హాజరై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మద్దతు తెలిపిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, పేదల సంక్షేమం, గృహరహిత కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలు చూపిన ఆదరణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి పార్టీకి మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆత్రం సుగుణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జి శ్యామ్ నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ, వైస్ చైర్మన్ గాజుల రవీందర్, డీసీసీ ఉపాధ్యక్షులు తారిఖ్, భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్ సెక్రటరీ నాంపల్లి శంకర్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు జక్కన్న, మారుతి పటేల్, రాంచందర్,ఆత్మ చైర్మన్ సత్తన్న,కౌన్సిలర్ లు భారతి, కృష్ణమ్మ, సప్న రాణి,మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, మాజీ సర్పంచ్ కాశాయ్య, కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా బాయి, ఇల్లూరి రాము, మహ్మద్ షఫి, శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం





**ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ అధ్యక్షులు అలీ బిన్ హైమద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, డైరెక్టర్ విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. వైస్ చైర్మన్ ప్రహ్లాద్ తెలంగాణ తల్లికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు హైమాద్ బిన్ అబ్దుల్లా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంధం శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ నాయకులు నిసార్, జావిద్, అంకుశాపూర్ మాజీ సర్పంచ్, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకట్ రవీందర్ , బ్యాంక్ సహకార సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శం

- ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**ఆదిలాబాద్:** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని 42వ వార్డు రిక్షా కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బైష్ ఠాకూర్ మంగళ, గణపత్వార్ దేవమ్మ–వసంత్రావుల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా కూడా కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు విడతల వారీగా రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందని వివరించారు. లబ్ధిదారుల నూతన గృహాలను పరిశీలించి ఇంటి నిర్మాణానికి అయిన వ్యయం, నిర్మాణ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. సొంతింటి కలను నెరవేర్చుకున్న కుటుంబాలకు అభినందనలు తెలియజేశారు. వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపే పథకంగా ఇందిరమ్మ ఇళ్లు నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ తరఫున లబ్ధిదారులకు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, గృహనిర్మాణ శాఖ పీడీ శంకర్, వార్డు కౌన్సిలర్ స్వాతి, ఇతర అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను అవమానపరచలేదు

- ఎంఎల్ఏ కోవ లక్ష్మీ అధ్యక్షతనే కార్యక్రమం ప్రారంభమైంది
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీర శ్యామ్ నాయక్



**ఆసిఫాబాద్ టౌన్:** సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కి ఎక్కడ కూడా అవమానం జరగలేదని, కెరమెరి మండలం కొత్తగూడా లో ప్రారంభమైన సీఎం పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేనే అధ్యక్షత వహించిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ అజ్మీర శ్యాం నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం తన నివాసంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చి ఆదిమ గిరిజన తెగలకు చెందిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించి ఆదివాసీలను గౌరవించడం జరిగిందని గుర్తు చేశారు. సీఎం పర్యటనలో భాగంగానే కొత్త గూడ లో స్థల ప్రభావం వలన కాగజ్ నగర్ క్రాస్ రోడ్ వద్ద సభ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గృహప్రవేశాల ప్రారంభోత్సవం లో సభా అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారని ఈ అంశాలను సభలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కులం కుశంగా ముఖ్యమంత్రి కి తెలియజేయడం జరిగిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్లో ఉన్న వంతెనలు ప్రాజెక్టులు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్వయంగా తెలిపారని గుర్తు చేశారు. సీఎం పర్యటన కొనసాగింపులో భాగంగానే బహిరంగ సభ నిర్వహించడం జరిగిందని అక్కడ ఎమ్మెల్యేను మాట్లాడనివ్వలేదని అనడం సరి కాదని అన్నారు .సభ నిర్వహణ కన్వీనర్ గా వ్యవహరించిన సివిల్ సప్లై కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హోదాలో ప్రేమ్ సాగర్ రావు ప్రసంగించారని గుర్తు చేశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ,ఎమ్మెల్యేలకు కాకుండా ఇతర జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను కూడా సమయాభావం వల్ల ప్రసంగించే అవకాశం రాలేదని తెలిపారు. ఉద్యోగాల విషయానికి వస్తే ఇప్పటికే 977 రాష్ట్రవ్యాప్తంగా వైద్యులను నియమించగా 600 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలో పూర్తి స్థాయిలో ప్రొఫెసర్లను నియమించినప్పటికీ జిల్లాకు వచ్చేందుకు కొంతమంది ఆసక్తి చూపడం లేదని తెలిపారు. ఇతర జిల్లాల కంటే 50 వేల రూపాయలు అదనంగా వేతనం చెల్లిస్తామన్న ఎవరు కూడా ముందుకు రావడం లేదని వివరించారు. ఎమ్మెల్యేగా తమకు కూడా బాధ్యత ఉందని ఎవరైనా ఇక్కడ విధులు నిర్వహించేందుకు ముందుకు వస్తే తీసుకురావాలని సూచించారు. ఆదివాసి మహిళ ఎమ్మెల్యే అయినా కోవ లక్ష్మి తనను అవమానపరిచారని ఆరోపించడానికి తమ విజ్ఞతకే వదిలి పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు నిజాం, మురళి, జక్కయ్య , కాశయ్య , రవి, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన జిల్లాకు దక్కని భరోసా

**సీఎం సభపై సీపీఎం ధ్వజం**




ఆసిఫాబాద్ టౌన్: వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగం జిల్లా ప్రజానికానికి తీవ్ర నిరాశను మిగిల్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ విమర్శించారు. దశాబ్దాలుగా జిల్లా ఎదుర్కొంటున్న రోడ్లు, వంతెనలు, విద్యా, వైద్య సమస్యలపై సీఎం ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం విచారకరమన్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి బ్రిడ్జి నిర్మాణం దశాబ్దాలుగా అసంపూర్తిగానే ఉందని, వర్షాకాలంలో ప్రజలు నాటు పడవలపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుంపల్లి, లక్మాపూర్ వంతెనల పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి పెద్ద భవనాలతో అందంగా కనిపిస్తున్నా, లోపల వైద్యం లేక కేవలం 'రెఫరల్ ఆసుపత్రి'గా మారిపోయిందని దుయ్యబట్టారు. ఇక విద్యా రంగం విషయానికి వస్తే, విద్యార్థులు అద్దె భవనాల్లోని ఇరుకు గదుల్లో మగ్గుతున్నారని, గతేడాది ప్రారంభించిన డీఈడీ కళాశాలలో నేటికీ ప్రవేశాలు లేవని, జిల్లాకు ఐటీఐ కళాశాల మంజూరు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లా సమస్యలపై ముఖ్యమంత్రి గారు భరోసా కల్పిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని, ఇప్పటికైనా జిల్లా ఇంచార్జ్ మంత్రి ప్రత్యేక దృష్టి సారించి ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దినకర్ డిమాండ్ చేశారు.

# ప్రజల గొంతుకగా 'ఉద్యమ కెరటం'..

- ఘనంగా 'ఉద్యమ కెరటం' ప్రథమ వార్షికోత్సవ లోగో ఆవిష్కరణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రిక పాత్ర కీలకం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్:** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారంలో 'ఉద్యమ కెరటం' దినపత్రిక కీలక పాత్ర పోషిస్తోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కొనియాడారు. మంగళవారం ఆమె నివాసంలో 'ఉద్యమ కెరటం' దినపత్రిక ప్రథమ వార్షికోత్సవ లోగోను ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండీ అహ్మద్, పత్రిక ఎడిటర్ అబ్దుల్ రహమాన్, స్థానిక కౌన్సిలర్లు, జర్నలిస్టులతో కలిసి ఆమె ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే 'ఉద్యమ కెరటం' దినపత్రిక ప్రజల మనస్సుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని విశేష ఆదరణ పొందిందని ప్రశంసించారు. పత్రికలు ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఈ దినపత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మరింత పేరు గాంచాలని ఆకాంక్షిస్తూ.. పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు బాలకృష్ణ, నాగు



బాయి, రాజంపేట ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి , జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు రాధాకృష్ణ చారి, బీఆర్ఎస్ నాయకులు అశోక్, సాయి శ్రావణ్, రాజ్ కుమార్ మహిళా నాయకురాళ్లతో పాటు పలువురు జర్నలిస్టులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న నాయకులు, ఉద్యమకారులు



**కాగజ్నగర్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాగజ్నగర్లోని ప్రాణహిత నిలయం వద్ద మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. దశాబ్దాల పాటు సాగిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు, రైతులు, వివిధ వర్గాల ప్రజల పోరాటాల ఫలితంగానే 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం కేవలం రాష్ట్ర విభజన కోసం జరిగిన పోరాటం మాత్రమే కాదని, స్వాభిమానం, స్వయంపాలన, సమాన అభివృద్ధి కోసం జరిగిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమమని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పలు రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను సాకారం చేయడం ప్రతి తెలంగాణ పౌరుడి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, నాయకురాళ్లు, తెలంగాణ ఉద్యమకారులు, డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ అభిమానులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం**

**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమ పోరాట వీరులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ రెహాన బేగం ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు, జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మురళిరెడ్డి, మొరిశెట్టి సాంబశివరావు, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు,



మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

- అమరవీరులకు ఘన నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్




**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వెల్ఫేర్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ముందుగా ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి, అనంతరం తెలంగాణ చౌక్లోని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె.జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశయాలను సాకారం చేస్తూ తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.

## ములుగు మార్కెట్ కమిటీ కార్యాలయంలో అవతరణ వేడుకలు

**జాతీయ జెండా ఆవిష్కరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి**



**ములుగు:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకుంటూ జాతీయ పతాకానికి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సేద సారంగం, డైరెక్టర్లు అలోత్ దేవ్ సింగ్, రసపుత్ సీతారాం, సమ్మయ్య, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలకు శతకోటి వందనాలు

**హన్మకొండ:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఆరు దశాబ్దాల ఉద్యమ పోరాటం, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, అమరవీరుల రక్తసిక్త గాథల ఫలితంగానే నేటి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్లో బలంగా వినిపించిన సుష్మా స్వరాజ్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర బిల్లుకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మన భాష, యాస, సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీకగా తెలంగాణ నిలుస్తోందని పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉండే రాష్ట్రం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే రాష్ట్రం, మహిళలకు భద్రత కలిగిన రాష్ట్రం, ప్రతి కుటుంబం సుభిక్షంగా జీవించే తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సుశాసనంతో కూడిన "వికసిత తెలంగాణ" నిర్మాణానికి బీజేపీ నిరంతరం కట్టుబడి ఉందని తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన వార్డు సభ్యుడు చెట్టి వెంకటేష్

**వర్ధంతి కార్యక్రమానికి 50 కిలోల బియ్యం అందజేత**



**కాగజ్నగర్:** భట్టుపల్లి గ్రామంలోని సీ బాబు కాలనీలో నివసిస్తున్న ఓ నిరుపేద మైనార్టీ మహిళ ఇటీవల ఎండదెబ్బ కారణంగా మృతి చెందారు. ఆ కుటుంబానికి అండగా 12వ వార్డు సభ్యుడు చెట్టి వెంకటేష్ ముందుకు వచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు వర్ధంతి కార్యక్రమ నిర్వహణకు సహాయంగా చెట్టి వెంకటేష్ మంగళవారం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సహాయాన్ని భట్టుపల్లి గ్రామ సర్పంచ్ రాజేందర్ జాదవ్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు తమ కష్టకాలంలో అండగా నిలిచిన చెట్టి వెంకటేష్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు సభ్యుడు భాస్కర్ల శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు అయిల్లా శంకర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పార్వతి అంజన్న, గులాం నసీర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన గృహప్రవేశ మహోత్సవం



**గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలో తెలంగే సంగీత–రవి దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల, మండల స్పెషల్ ఆఫీసర్ సునీత, తహశీల్దార్ కవితా రెడ్డి, ఎంపీడీఓ ఇంతియాజ్, హౌసింగ్ ఏఈ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆడే శీల మాట్లాడుతూ నూతన గృహంలో కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గృహప్రవేశం కుటుంబ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న హౌసింగ్ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భూమన్న, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీని సన్మానించిన ఆడే గజేందర్



**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ అధికారిక కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు) షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారితో కలిసి కలెక్టరేట్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష సతీష్, తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గోక గణేష్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**గుడిహత్నూర్:** మండలంలోని ఉమ్రి ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోజన్న, స్థానిక సర్పంచ్, పీఎస్ హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భోజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడిబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్థానిక సర్పంచ్, పీఎస్హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ రామచంద్ర, ఉపాధ్యాయులు ఆర్.మోహన్, వసంత్, సిద్దు, శేషుబాయి, శశికళ, అరుణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శాసన మండలి డిప్యూటీ చైర్మన్ కు సన్మానం



**ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా వచ్చిన తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసానికి రాగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన కు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువరి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ , సలం బిన్ అహ్మద్, దూడల లక్ష్మి, నాగుబాయ్, మాజీ సర్పంచ్ సరస్వతి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అన్సర్, నిసార్ , జీవన్, గోపాల్, సమద్ , అశోక్ , సాయి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రగతి పథంలో ప్రజా ప్రభుత్వం

- నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్
- జిల్లా కేంద్రంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు...



**ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న నాటి నుండి నేటి వరకు ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని , సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా, ప్రజా ప్రభుత్వం అన్ని రంగాలలో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో శరవేగంగా ముందుకు తీసుకెళ్తోందని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండా ఈ సందర్భంగా పోలీసులకు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేడు దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్‌గా నిలపడంలో ఈ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని , ప్రభుత్వం కేవలం ప్రణాళికలకే పరిమితం కాకుండా, ప్రతి పథకాన్ని లబ్ధిదారుల దరిచేర్చేలా పారదర్శక పాలనను అందిస్తోందని తెలిపారు.

### మహాలక్ష్మి పథకం ద్వారా మహిళా సాధికారత

మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మరియు కేవలం 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ ద్వారా గృహిణులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, ఈ పథకం మహిళల ఆర్థిక స్వవలంబనకు ఎంతగానో దోహదపడుతోందన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

సొంతింటి కల కలిగిన ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ ప్రభుత్వం రూ. 5 లక్షల పూర్తి సబ్సిడీతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని , ఇందుకు అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ పేదల సొంతింటి కలను నిజం చేస్తోందన్నారు.

### గృహజ్యోతి పథకంతో ఉచిత విద్యుత్ వెలుగులు

పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ప్రతి ఇంటా ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోందని, ఈ జీరో బిల్లుల ప్రక్రియ ద్వారా లక్షలాది కుటుంబాలు నెలవారీ కరెంట్ బిల్లుల భారం నుండి ఉపశమనం పొందాయన్నారు.

### రాజీవ్ ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం

పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ఉచిత వైద్య పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందని, దీనివల్ల పైసా ఖర్చు లేకుండా వేలాది మంది పేదలు అత్యుత్తమ వైద్య సేవలు పొందుతూ తమ ప్రాణాలకు భరోసా పొందుతున్నారు.

### రైతు భరోసా, రైతు బీమాతో అన్నదాతకు అండ

వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం 'రైతు భరోసా' ద్వారా అన్నదాతలకు సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందిస్తోందని, దీనితో పాటు ఆపదలో ఉన్న రైతు కుటుంబాలను ఆదుకునేందుకు, మరణించిన రైతు నామినీలకు వారం రోజుల్లోనే రూ. 5 లక్షల 'రైతు బీమా' పరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సమగ్ర సంక్షేమ చర్యలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పును తీసుకువస్తూ, సుస్థిరమైన, ప్రజా కేంద్రీకృత పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా ఎస్పీ నీతికా పంత్, ఎమ్మెల్సీ దండ విట్టల్, ఆసిఫాబాద్, సిర్పూర్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, ఏఎంసీ చైర్మన్ మంగ, సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఎన్నో ఏళ్ల ఉద్యమాలు, త్యాగాలు, ఆకాంక్షలు, అమరవీరుల బలిదానాల ఫలితమని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, అమరవీరుల త్యాగాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అన్నిరంగాల్లో పురోగతి సాధిస్తూ దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తూ, ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీటి రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించి, రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మాదారం-3లో ఘనంగా బడిబాట కార్యక్రమం

- కరపత్రాల ఆవిష్కరణ.. నూతన అడ్మిషన్లకు శ్రీకారం

**తాండూర్:** తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూర్ మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ మాదారం-3 పాఠశాలలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ చందనాల రవి, అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంధం లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై కరపత్రాలను విడుదల చేశారు. కరపత్రాల ఆవిష్కరణ అనంతరం తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నూతన అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. మండల విద్యాధికారి చేతుల మీదుగా అంగన్వాడీ కేంద్రం నుంచి ఎనిమిది మంది చిన్నారులకు పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్నిరకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన ఊరి పిల్లలను మన ప్రభుత్వ బడిలోనే చదివించాలనే సంకల్పంతో అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్లు సువర్ణ, తిరుమల, గ్రామ వార్డు సభ్యులు, స్థానిక యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆకాంక్షల సాధనే లక్ష్యం

- తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్




**ఆదిలాబాద్:** ఎందరో త్యాగధనులు, అమరవీరుల బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యాలను సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పట్టణ ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు సమగ్ర అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అమరవీరుల ఆశయాలను సాకారం చేయడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, కౌన్సిలర్లు స్వాతి, ఇజ్జగిరి సంజయ్, మహెబూబ్, పర్వేజ్, రిజ్వాన్, చరణ్ గౌడ్, మంగేష్తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జై తెలంగాణ, అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువరి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ , సలం బిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అన్సర్, సమద్ , అశోక్ , సాయి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



చురకలు



# ఇల్లంద గ్రామంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భారత దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సహకరించిన ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న గౌడ్, వర్ధన్నపేట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మరుపట్ల అరుణ సాయి మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ఉచిత గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ క్యాంటీన్లు, వడ్డీలేని రుణాలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్నధాన్యానికి బోనస్, ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన వంటి పథకాలను ప్రస్తావించారు. గత ప్రభుత్వం ప్రజలకు తగిన సంక్షేమ ఫలాలు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు అవసరమైన మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తన సొంత నిధులతో కూడా సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంద గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు రాజేంద్ర ప్రసాద్, మరుపట్ల అరుణ, మరుపట్ల సాయి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గడ్డం సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు బీర్రు సురేందర్, దేవస్థానం డైరెక్టర్ మైదాము బుచ్చిమల్లు, ఎద్దు శ్రీనివాస్, అయినవోలు దేవస్థానం డైరెక్టర్ గుంటి కుమారస్వామి, గుత్తెల్లి ఎలియా, జోగుల పరుశురాములు, భాషబోయిన ప్రవీణ్, సుధాకర్, ఎంపీ సాయిలు, జోగుల భాస్కర్, సాంగినేని రాజు, తుళ్ల జేలు, ఎద్దు రాజకుమార్, ఎండీ సఫియా, యాఖుబ్ పాషా, మైదం శ్రీను, ఆరూరి అనిల్, టేకులగూడెం రవి, కొంగరతన్, భూక్య దేవన్న, భూక్య మల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

- **అమరవీరులకు ఘన నివాళులు**
- **లబ్ధిదారులకు పథకాల పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**
- **ఉద్యమకారులకు సన్మానం**

**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వెల్ఫేర్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకలకు ముందు ఆర్ అండ్ బి అతిథి గృహం, కలెక్టరేట్ ప్రాంగణంలోని అమరవీరుల స్థూపం, తెలంగాణ చౌక్లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి అతిథులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సందేశం అందించారు. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన ఐదుగురు మహిళలకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదిలాబాద్ గ్రామీణ, బోథ్, బేల మండలాలకు చెందిన సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం ఇద్దరు ట్రాన్స్జెండర్లకు ఒక్కొక్కరికి రూ.75వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా 13 మంది దివ్యాంగులకు సుమారు రూ.7లక్షల విలువైన మొబైల్ బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలను అందజేశారు. కొత్తగా మీసేవా కేంద్రాల నిర్వహణకు ఎంపికైన ఐదుగురికి మంజూరు పత్రాలు అందించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం కప్ విజేతలను సన్మానించి ప్రోత్సాహకంగా రూ.10వేల నగదు బహుమతిని ప్రభుత్వ విప్ అందజేశారు. తెలంగాణ రాష్ట్ర



సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్లో జోరుగా చేరికలు

- **బీజేపీకి గుడ్బై చెప్పిన పీఏసీఎస్ డైరెక్టర్**



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం భారీ చేరికలు జరిగాయి. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ కన్య వినోద్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు రొండ్ల పోశెట్టి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్లు వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్లో చేరుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. రైతుల సమస్యలపై స్పందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా పంటల కొనుగోలుపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూ పంటల కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో జొన్న, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, ఆదిలాబాద్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, తంతోలి గ్రామ సీనియర్ నాయకుడు రాజేశ్వర్, దండు మధుకర్తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**



**తాండూర్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తాండూర్ మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామపంచాయతీలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. తాండూర్ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ యు.జ్యోత్స్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ జెండాను ఎగురవేశారు. తాండూర్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎన్.దేవయ్య, మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండలంలోని ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆయా శాఖల అధికారులు జాతీయ పతాకాలను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్ జాతీయ జెండాను ఆవిష్కరించగా, మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో సర్పంచులు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాలను ఎగురవేసి విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, రాష్ట్ర సాధన ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో కూడా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎస్.దత్తు మూర్తి, బీజేపీ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# డోంగర్గావ్లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- **పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు**



**గుడిహత్నూర్:** మండలంలోని డోంగర్గావ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అబ్దుల్ రహేమాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంపీడీఓ ఇంతియాజ్, హౌసింగ్ ఏఈ గణేష్, సర్పంచ్ అబ్దుల్ రహేమాన్ కలిసి నూతన గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులు పండుగ వాతావరణంలో తమ కొత్త ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇంతియాజ్, హౌసింగ్ ఏఈ గణేష్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకలను ఆపితే ప్రజా సమస్యలు ఆగవు

### ఎన్నికల హామీలపై నిలదీస్తే అక్రమ అరెస్టులా..?

### బీఆర్ఎస్ నేతల ఆగ్రహం



**బెజ్జూర్:** ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను నిర్బంధించడం ద్వారా సమస్యలను అణచివేయలేరని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బూస సారయ్య యాదవ్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కార్యక్రమానికి ఆటంకం కలిగించే అవకాశం ఉందనే కారణంతో పలువురు నాయకులను పోలీసులు సోమవారం వేకువజామున అదుపులోకి తీసుకున్నట్లు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని అన్నారు. ప్రజల తరఫున ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి, ఇందిరమ్మ ఇళ్ల వంటి హామీల అమలుపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులను నిర్బంధించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ఎన్ని కేసులు పెట్టినా, ఎన్నిసార్లు అరెస్టు చేసినా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ హామీల అమలుకు నిరంతరం పోరాడుతామని, ఎన్నికల హామీలు పూర్తిగా నెరవేరే వరకు బీఆర్ఎస్ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీ విస్మరిస్తున్న ప్రభుత్వం



**బెజ్జూర్:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక మండల అధ్యక్షుడు కుమ్మరి లింగన్న ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని, ప్రతినెలా గౌరవ వేతనం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీల అమలులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా ఉద్యమకారుల త్యాగాలను గుర్తుచేసుకుని వారి సంక్షేమంపై ప్రభుత్వం స్పందిస్తుందని ఆశించామని, కానీ వేడుకలకు మాత్రమే పరిమితమై ఉద్యమకారుల సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన అనేక మంది ఉద్యమకారులు, ఉద్యమంలో పాల్గొని కేసులు ఎదుర్కొన్న వారు, త్యాగాలు చేసిన కుటుంబాలు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమకారులకు వెంటనే గుర్తింపు కార్డులు, గౌరవ వేతనం, పెన్షన్తో పాటు ఇతర సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## అంబరాన్ని అంటిన తెలంగాణ అవతరణ సంబరాలు

### ముువ్వన్నెల శోభతో కళకళలాడిన ప్రభుత్వ కార్యాలయాలు



**బెజ్జూర్:** మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం అంబరాన్ని అంటిన సంబరాల మధ్య ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, రహదారులు మువ్వన్నెల జెండాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా కనిపించాయి. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సై సర్తాజ్ పాషా, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామ్మోహన్ రావు, మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ సునీత జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దుర్గం సరోజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ ఓంప్రకాష్ జెండా ఎగురవేశారు. అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా సంస్థల్లో అధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల కార్యాలయాల్లో కూడా అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ చరిత్రను స్మరించుకున్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### గ్రామపంచాయతీ సిబ్బందికి హెల్త్ కిట్ల పంపిణీ

**హన్మకొండ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గరిగే కల్పన కృష్ణమూర్తి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఉప సర్పంచ్ బత్తిని రాజు, పంచాయతీ కార్యదర్శి మనోహర్, వార్డు సభ్యుల చేతుల మీదుగా గ్రామపంచాయతీ సిబ్బందికి హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలుగు ప్రజల హృదయేశ్వరి 'మల్లీశ్వరి'

తెలుగు చలనచిత్ర చరిత్రలో స్వర్ణ యుగానికి చెందిన గొప్ప చిత్రంగా మల్లీశ్వరి ఖ్యాతి గాంచింది. ఆ సినిమా భారతదేశం లోనే కాక ఇతర దేశాలలో కూడా చాలా రోజుల పాటు ప్రదర్శింప బడింది. రాచరికపు ఆడంబరాలను, ఆచారాలను చిత్రించినా ఆ సినిమా కమ్యూనిస్టు దేశమైన చైనా లోనే వంద రోజులకు పైగా ఆడింది. ఆ సినిమాకు మాటలు, పాటలు, కళ, నటన, సంగీతం, ఛాయా గ్రహణం, ఎడిటింగులతో సహా అంతా తానై బి.ఎన్.రెడ్డి నడిపించినవే. అందుకే కృష్ణశాస్త్రి "మల్లీశ్వరి సృష్టిలో మేమంతా నిమిత్త మాత్రులం. బి.ఎన్.రెడ్డి దీనికి సర్వస్వం." అన్నారు. శ్రీకృష్ణదేవ రాయలంటే ఆరాధనాభావమున్న, ఆంధ్రాంగ్ల సాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేసిన బి.ఎన్.రెడ్డి రాయలవారి మీద ఒక సినిమా తీయాలని సంకల్పించారు. బి.ఎన్. తమ తొలి సినిమా 'వందేమాతరం' షూటింగు కోసం హంపి ప్రాంతానికి వెళ్ళినప్పటి నుండి అందుకు తగిన కథ కోసం వెదుకుతూనే ఉన్నారు. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వచ్చిన ఒక కథ, బుచ్చిబాబు వ్రాసిన "రాయల కరుణ కృత్యం" నాటిక కలిపి దేవులపల్లి కృష్ణశాస్త్రి చేత "మల్లీశ్వరి" స్క్రిప్టుగా అభివృద్ధి చేశారు. అయితే బుచ్చిబాబు పేరు కథా రచయితగా సినిమాలో స్థానం కల్పించ లేదు. 1951 డిసెంబర్ 20న విడుదలైన చిత్రం వాహినీ వారి మల్లీశ్వరి. ఇది దేవులపల్లి వారి తొలి సినిమా. అయన పాటలు – మాటలు, ర'సాలూరు' రాజేశ్వర రావు కమ్మని బాణీలు, ఎన్.టి.ఆర్., భానుమతిల అద్భుత నటన, ఘంటసాల – భానుమతి గార్ల విలక్షణమైన గాన పటిమ అన్నీ కలబోసిన రాగేశ్వరి మల్లీశ్వరి. శ్రీ కృష్ణ దేవరాయలు పాలించే విజయ నగరానికి సమీపాన నివసించే పల్లెటూరి యువ ప్రేమికులు మల్లి, నాగరాజు. తెలియక వెటకారానికి, మారువేషంలో వున్న రాయలు, పెద్దనలతో రాణివాసం పల్లకి కోరి, తద్వారా ప్రేమికులు విడిపోయి, విరహ వేదన అనుభవిస్తారు. అలనాడు మహాకవి కాళిదాసు ప్రేమికుల సంకేతాలను 'మేఘ సందేశం' గా రచించగా, ఈ చిత్రంలో నాయికా నాయకుల నడుమ తొణికిసలాడే ప్రణయ స్పందనా తరంగాలను 'ఆకాశ వీధిలో హాయిగా' తేలియాడే మబ్బు తునకతో పంపారు కృష్ణ శాస్త్రి. అంతేకాదు ఈ మల్లీశ్వరి మేఘమాల నిజంగానే దేశదేశాలు తిరిగింది, చైనాతో సహా. సాలూరికి ఇష్టమైన చక్కని ఈ పాటను రాగ మాలిక గా భీంపలాస్, కీరవాణి, హంసానంది రాగాలలో కూర్చి ఘంటసాల, భానుమతి గార్లతో అందాల ఓ మేఘమాల పాట పాడించారు సాలూరు వారు.

నందమూరి తారక రామారావు, భానుమతి, సురభి కమలాబాయి, బేబీ మల్లిక, మాస్టర్ వెంకటరమణ, న్యాపతి రాఘవరావు, ఋష్యేంద్ర మణి, శ్రీవాత్సవ, కుమారి, వంగర, కమలాదేవి తదితరులు తమ పాత్రలలో ఒదిగి పోయారు. చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలన నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుంది. అప్పటి రాజవిధానం ప్రకారం రాజాంతః పురంలో పని చేయడానికి ఇష్టపడిన యువతులను వారింటికి పల్లకీ పంపి, వారి కుటుంబానికి ధన కనక బహుమానాలు ఇచ్చి, రాజాస్థానా నికి పిలిపించే వారు. కాని ఒకసారి అంతఃపురంలో చేరిన యువతు లకు బయటి మగవారితో సంబంధాలు నిషిద్ధం. ఈ నియమాన్ని అతిక్రమించిన వారికి ఉరిశిక్ష వేసేవారు. చిత్రంలో పాటలు అన్నీ విశేషంగా జనాదరణ పొందాయి. లంబోదర లకుమికరా – పురందర దాసు కీర్తన; కోతీ బావకు పెళ్ళంట, కోవెల తోట విడిదంట; పిలచిన బిగువటరా ఔరౌరా; ఔనా! నిజమేనా! మరతునన్నా మరువలేను; ఉషా పరిణయం యక్షగానం– కమలాదేవి, భానుమతి, పరుగులు తీయాలి, గిత్తలు ఉరకలు వేయాలి; మనసున మల్లెల మాలలూగెనే; ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు ; ఎన్నినాళ్ళకీ బతుకు పండెనో, ఎంత హాయి ఈ రేయి నిండెనో; ఝుం ఝుం ఝుం తుమ్మెదా తుమ్మెదా తదితర పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఒక సంప్రదాయ గానం, మరొక పురందరదాసు కీర్తన (గణేశ ప్రార్థన) తప్పించి మిగిలినవన్నీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలే. స్త్రీలను ఆకర్షించేందుకు భక్తి పాటలను ఏదో విధంగా చొప్పించే రోజుల్లో ఈ సినిమాలో టైటిల్స్ శ్రీగణనాథం అనే గీతం తప్ప మిగతా పాటలన్నీ సినిమాకు ముఖ్య కథాంశమైన అనురాగం, ప్రణయం, రెండవ థీం అయిన విజయనగర వైభవం చుట్టూ ఉండేలా రూపొందించారు. మొత్తం పాటల స్వరకల్పనకు ఆరు నెలల కాలం పట్టింది సినిమాలో మల్లీశ్వరి నాగరాజు ముందు ప్రదర్శించిన నృత్య గానాలను మారువేషంలో చూసిన అల్లసాని పెద్దన ఆశువుగా ఆమెను మెచ్చుకుంటూ ఓ పద్యం చెప్పే సన్నివేశం ఉంది. అల్లసాని పెద్దన రాసినట్లుగా అల్లిక జిగిబిగితో రావాలన్న జాగ్రత్త వల్ల కృష్ణశాస్త్రితో 108 పద్యాలు రాయించుకుని అందులో ఒక్కటి ఎంపిక చేసుకున్నారు బి.ఎన్.రెడ్డి. మల్లీశ్వరి చలనచిత్రం ద్వారా చిత్రరంగానికి ప్రముఖ కవి, భావకవితోద్యమంలో ముఖ్యుడైన దేవులపల్లి కృష్ణశాస్త్రిని పరిచయం చేశారు. ఈ చిత్రాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ చూశారు. ఆయన గమనించిన విషయం – చిత్రంలో మల్లి, నాగరాజులు, మారువేషంలో ఉన్న రాయలవారిని కలిసింది పెద్దవర్షం వచ్చిన కారణంగా. ఐతే రాయలవారు వీరితో మాట్లాడి తిరిగి వెళ్ళిపోయే సమయంలో గుర్రాల స్వారీ వల్ల ధూళి రేగుతుంది. ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సైకిల్ సామాన్యుని రవాణా సాధనం

## నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం



సైకిల్ మానవ జీవితంతో మమేకమైన ముఖ్యమైన వాహనం. మామూలుగా మనిషి పరుగెత్తే వేగం కంటే ఆరు రెట్ల వేగంతో ఇది ప్రయాణం చేయగలదు. దాని బరువు కంటే డజను రెట్ల బరువును మోసుకెళ్ళ గలదు. శబ్దం చేయకుండా ఇది ప్రయాణం చేయగలదు. ప్రధానంగా రోడ్డు ఉన్నా లేకున్నా, అన్ని రకాల రోడ్లపై వెళ్ళటం, ఎక్కడైనా సరే ఆపడానికి వీలుండటం కారణాలుగా అనేక దేశాల్లో సామాన్య మానవునికి అందుబాటులో ఉండే సాధారణ, రవాణా సాధనంగా సైకిలు పరిగణించ బడుతోంది. ఇది బహుళ ప్రయోజనకారి. ప్రయాణానికి, వ్యాయమానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ పడుతుంది. ఒకప్పుడు పనులను వేగవంతం, సులభ తరం చేయడంలో దీని పాత్ర ఎంతో ముఖ్యంగా ఉండేది. సైకిల్ సరళమైన, సరసమైన, పర్యావరణ అనుకూల రవాణా సాధనం. వైద్య, ఆరోగ్య పరంగా, క్రీడలు నిర్వహించేందుకు కూడా ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మారుతున్న ఆధునిక కాలంలో సైకిల్ వాడకం గణనీయంగా తగ్గి పోయింది. ఎన్నెన్నో సౌకర్యాలు వచ్చి సైకిల్ వాడకం మరుగున పడిపోయింది. ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 3న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. సైకిల్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహణ కోసం 2016వ సంవత్సరం నుంచి ప్రపంచ సైక్లింగ్ అలయెన్స్ (డబ్ల్యూసీఏ), ఐరోపా సైక్లిస్ట్స్ సమాఖ్య (ఈసీఎఫ్)లు ఐక్యరాజ్య సమితిని విజ్ఞప్తి చేశాయి. 2018, ఏప్రిల్ లో 193 దేశాలు పాల్గొన్న ఐక్యరాజ్య సమితి 72వ సాధారణ సదస్సులో ఈ తీర్మానాన్ని ఆమోదించ బడింది.

సైకిలు ఒక సాధారణమైన రవాణా సాధనము. ఇది మానవ శక్తితో నడపబడే రెండు చక్రాల వాహనము. దీనిని 19వ శతాబ్దంలో ఐరోపాలో మొదటి సారిగా ఉపయోగించారు. ప్రపంచంలో ప్రస్తుతం చైనాలో సైకిలు ఉపయోగం ఎక్కువగా ఉంది. విశ్వవ్యాప్తంగా ఇంచుమించు ఒక బిలియను సైకిళ్ళు ఉపయోగంలో ఉన్నట్లు అంచనా ఇవి మనుషులకు బొమ్మలు, వ్యాయామంలో, మిలటరీ, పోలీస్, సమాచార సరఫరా మొదలైన వివిధ రకాలుగా ఉపయోగ పడుతున్నాయి. సైక్లింగ్ ఒక రకమైన క్రీడ. రిక్షా ఒకరకమైన మూడు చక్రాల సైకిలు. సైకిలును మరింత చిన్నగానూ, వేగంగా పోయే లాగానూ చేయటంలో లాసన్ అనే ఇంగ్లండు దేశీయుడు కృతకృత్యుడయ్యాడు. రెండు చక్రాల నడుమ క్రాంక్ నీ, ఫెడల్ నీ తొలిసారిగా అమర్చింది ఇతడే. ఫెడల్ ని తొక్కినప్పుడు తొక్కేవాడి కాళ్ళ శక్తిని ఫెడల్ లకు అమర్చిన గేర్ చక్రం నుంచి వెనక ఇరుసు వద్ద ఉన్న చిన్న గేర్ చక్రానికి అందించటం కోసం స్వీడన్ కి చెందిన హాన్స్ రెనాల్డ్ ఒక గొలుసును వాడాడు. క్రమంగా చక్రాలకు స్పోక్ లు, బాల్ బేరింగులు, గేర్ లు, కూర్చోవడానికి స్ప్రింగ్ సీటు కనుక్కోబడ్డాయి. 1890 లో పెద్ద ఎత్తున సైకిళ్ళను తయారు చేయటంమొదలయ్యే సరికి అవి ఇంచుమించు ప్రస్తుతం వాడుతున్న నమూనా ప్రకారమే ఉండేవి. అయితే వాటికి అప్పట్లో టైర్లు మాత్రం లేవు. ప్రముఖ చిత్రకారుడు లియొనార్డో డావిన్సీ సైకిలును పోలిన రఫ్ స్కెచ్ లు కొన్ని గీశాడు. 1690 లో ఫ్రాన్సు జాతీయుడు దిసీవ్రాక్ సైకిలులాంటి వాహనాన్ని తొలిసారిగా రూపొందించాడు. దాన్ని "హాబీ హార్స్" అని పిల్చేవారు. దానికి పెడల్స్ లేవు. 1840 లో స్కాట్లాండు జాతీయుడైన కిర్క్ పాట్రిక్ మాక్మిలన్ పెడల్స్ ను జతచేసి నిజమైన సైకిలు రూపును కల్పించాడు. తర్వాత కొన్ని మార్పులకు గురిఅయి 1900 సంవత్సరంలో ఆధునికమైన సైకిలు తయారైంది. ఇది ఇప్పటి సైకిలు మాదిరే ఉండేది. రహదారి భద్రతను మెరుగుపరచడానికి, పాదచారులు భద్రతను కాపాడటానికి సైకిల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. శారీరక శ్రమను బలోపేతం సామాజిక దూరాలను సులభతరం చేయడానికి ఉపయోగ పడుతుంది. సైక్లింగ్ కావల్సిన ఉత్తమ పద్ధతులను, సరైన మార్గాలను అవలంబించేలా సభ్య దేశాలను ప్రోత్సహిస్తోంది. డయాబెటిస్ ఉన్నవారికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడానికి ప్రపంచ సైకిల్ దినోత్సవం కృషిచేస్తోంది.

ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ స్వచ్ఛంద సంస్థలు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ సైకిల్ వాడకంపై, సైక్లింగ్ చేయడంవల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కలిగిస్తాయి. సమాజంలో సైక్లింగ్ సంస్కృతి తెర మరుగు కాకుండా చేయడానికి, ప్రోత్సహించడానికి కావాల్సిన ఉత్తమ పద్దతులను సరైన మార్గాలను అవలంబించేలా సభ్య దేశాలను ప్రోత్సహిస్తుంది. రహదారి భద్రతను మెరుగు పర్చడానికి సభ్య దేశాలను ప్రోత్సహించడమే కాకుండా పాదచారుల భద్రతను కాపాడడానికి సైకిల్ వాడకాన్ని ఎంతో ప్రోత్సహిస్తుంది. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజు పెరుగుతున్న నేపథ్యంలో సైకిళ్లు కొనేందుకు, సైకిళ్లపై వెళ్లేందుకు ఇప్పటికి కొందరు ఆసక్తి చూపిస్తున్నారు. తాము వాడుకున్న సైకిళ్లను అపురూపమైన వస్తువులుగా నేటికీ భద్రంగా దాచి ఉంచిన వారూ ఉన్నారు. తాత, తండ్రుల నుంచి సైకిల్ రిపేరు జీవనోపాధిగా, కుటుంబ పోషణ చేస్తున్న వారెందరో ఇప్పటికీ ఉ న్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. శారీరక వ్యాయమానికి సైకిల్ తొక్కడం ఎంతో మంచిది. బీపీ, మధుమోహం లాంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయి. రోజుకు ఐదారు కిలోమీటర్లు సైకిల్ తొక్కినట్లయితే ఆరోగ్యానికి ఎంతో మంచిదని నిపుణులు సూచిస్తుంటారు. అంతేకాదు సైకిల్ తొక్కడం వల్ల శరీరం హుషారుగా పని చేస్తుంది. మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆరోగ్యం పది కాలాల పాటు పదిలంగా ఉంటుందని చెబుతుంటారు పెద్దలు. సైకిలు బొమ్మను ఒక ఎన్నికల గుర్తుగా భారతదేశంలో ఎన్నికల సంఘం వాడుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా తెలుగుదేశం పార్టీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సమాజ్ వాది పార్టీ లకు ఎన్నికల గుర్తుగా సైకిలు బొమ్మ ఇవ్వబడింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆధునిక శరీర ధర్మశాస్త్ర పితామహుడు విలియం హార్వే

## నేడు విలియం హార్వే వర్ధంతి



శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతి గురించి చాలా కాలం క్రితమే పరిశోధించి, భావి వైద్యులకు అపూర్వ విజ్ఞానాన్ని అందించిన గొప్ప శాస్త్రవేత్త విలియం హార్వే. మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విల్లియం హార్వేకు దక్కుతుంది. శరీరం ద్వారా రక్త ప్రసరణను కనుగొన్న మొదటి పరిశోధకుడు. శరీరంలో రక్త ప్రసరణను సరిగ్గా వివరించి, విలియం హార్వే, ధమనులు మరియు సిరలు పూర్తి సర్క్యూట్ ను ఏర్పరుస్తాయని చూపించాడు. సర్క్యూట్ గుండె వద్ద మొదలై గుండెకు తిరిగి వెళు తుందని అపూర్వ పరిశోధనల ఫలితాలను రుజువు పరిచాడు. మానవ శరీరంపై ఆసక్తి పెంచుకున్న హార్వే అనేక జంతువుల శరీర అంతర్భాగాలను క్షుణ్ణంగా పరిశీలించి గుండెకు, రక్త ప్రసరణ వ్యవస్థ కు సంబంధించి లోతుగా అధ్యయనం చేసిన క్రమంలో గుండె పనితీరు, రక్త ప్రసరణ విధానాలను గమనించాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టు కుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్పగలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు.

విలియం హార్వే (ఏప్రిల్ 1, 1578 – జూన్ 3, 1657) ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని చాలా క్రితమే వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకు డయ్యాడు. నేడు హృదయం గురించి అందరికీ తెలుసు. రక్త ప్రసరణ వ్యవస్థ మొత్తం ఎలా నడుస్తుందో చెప్పగలుగు తున్నారు. అదే 16 వ శతాబ్దం వరకు గుండె గురించి దేవునికి తప్ప మానవ మాత్రులకు ఏమీ తెలియదు అని భావించే వారు. విలియం హార్వే ఇంగ్లండులోని ఫోక్స్టోన్‌లో 1578 ఏప్రిల్ 1న సంపన్నుడైన పట్టణ మేయరుకు పదిమంది సంతానంలో ఒకడిగా పుట్టాడు. పదిహేనవ యేట కేంబ్రిడ్జిలోని సైన్స్ కాలేజీలో చేరాడు. పట్టభద్రుడయ్యాడు. ఆపై వైద్య విద్య కోసం ఇటలీలోని పాడువా వైద్య విద్యాలయంలో చేరాడు. అక్కడ హారోనిమస్ ఫాబ్రీసియస్ అనే ప్రముఖ వైద్య శాస్త్రజ్ఞుని వద్ద శిష్యరికం చేశాడు. 1602 లో వైద్య శాస్త్రంలో పట్టా పుచ్చు కొనటమే కాకుండా ప్రత్యేకమైన యోగ్యతా పత్రాన్ని పొంద గలిగాడు. అక్కడి నుంచి లండన్ తిరిగి వచ్చాక ఇంగ్లండ్ రాజు మొదటి ఛార్లెస్ కొలువులో ఆస్థాన వైద్యుడిగా నియమితు డయ్యాడు. అంతటి హోదాలో ఉన్న సంపన్నులు ఎవరైనా విలాసంగా జీవితం గడిపేస్తారేమో కానీ, విలియం హార్వే మాత్రం కొత్త విషయాలు తెలుసు కోడానికి పరిశోధకుడిగా మారాడు. గుండెకు సంబంధించిన సందేహాలు మాత్రం ఆయనను వదలలేదు. గుండె నుండి బయలు దేరిన రక్తం రక్త నాళాలలో అటూ ఇటూ ప్రవహించి చివరికి హరించుకు పోతుందే తప్ప మళ్లీ గుండెను చేరదు అనే వాదంలో నిజం ఉన్నట్లు హార్వేకు తోచలేదు. పెద్ద పెద్ద సిరలలో కవాటాలు ఎందుకు ఉంటాయనే తపన కూడా ఆయనలో బయలు దేరింది. 1615 లో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ లో ఆయన లెక్చరర్ గా నియమింప బడ్డాడు. చేపలు, కప్పలు, కోళ్ళ పిండాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వాటి రక్త ప్రసరణ గురించి ఎంతో క్షుణ్ణంగా అధ్యయనం చేయ సాగాడు. గుండె ముడుచు కోవటం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్త నాళాలకు వెళుతుందని తెలుసు కున్నాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. గుండెలో నాలుగు గదులు ఉంటాయని, ధమనుల ద్వారా గుండె లోని రక్తం బయటికి పంప్ చేయ బడుతుందని, సిరల ద్వారా కవాటాలు రక్తాన్ని గుండె వైపుకి వెళ్ళనిస్తాయే కాని గుండె లోంచి రక్తాన్ని వెలుపలికి రానివ్వవని తెలుసు కున్నాడు. ఒక అర గంటలో శరీరంలో ఉన్న మొత్తం రక్తం గుండె నుండి వెలువడే రక్తమే ఎక్కువగా ఉంటుందని నాడీ వేగం, గుండె స్పందించే రేటు ఆధారంగా నిర్ధారించుకో గలిగాడు. చనిపోయిన ఖైదీల శరీరాలను అడుగడుగునా పరిశీలించడం ద్వారా గుండె ఒక పంపులాగా పనిచేస్తుందని, శరీరంలో సిరలు, ధమనుల ద్వారా రక్తం వలయా కారంలో ప్రవహిస్తుందని తెలుసు కున్నాడు. రక్తం ప్రవహించే మార్గంలో వాల్వులు ఎలా పనిచేస్తాయో కనిపెట్టాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్ప గలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు.

1628 లో, 50 సంవత్సరాల వయస్సులో, హార్వే తన పరిశోధనా ఫలితాలను ప్రచురించాడు – సాధారణంగా దీనిని డి మోటో కార్డిస్ – ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అని పిలుస్తారు. ఆంగ్లంలో అనాటమికల్ స్టడీస్ ఆన్ ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అండ్ బ్లడ్ ఇన్ యానిమల్స్ అంటారు. ఈ ప్రచురణ వైద్య శాస్త్ర చరిత్రలో అపూర్వమైనది. పరిశోధనల ద్వారా వచ్చిన ఫలితాలను మళ్ళీ పరిశోధనల ద్వారానే రూఢి పరచాలనే శాస్త్రవాది హార్వే. ఈ పుస్తకం ప్రచురించిన మూడు సంవత్సరాల తరువాత హార్వే మొదటి చార్లెస్ మహారాజుకు రాజ వైద్యునిగా నియమించ బడ్డాడు. కానీ రాజకీయ విపరిణామాల కారణంగా హార్వే లండన్ విడిచి పెట్టవలసి వచ్చింది. అప్పుడే కొంతమంది దుండగులు హార్వే ఇంటిలో లేని సమయం చూచి ఆయన నాలుగు దశాబ్దాలుగా సేకరించిన దాచుకున్న అమూల్యమైన విజ్ఞాన సంపద నంతా నాశనం చేశారు. అయినా హార్వే బాధ పడలేదు. నిరాశతో క్రుంగిపోలేదు. ప్రత్యుత్పత్తి, పిండాభివృద్ధి అంశాల మీద జీవితమంతా పరిశోధించాడు. 1651 లో "ఎక్సర్ సైజస్ ఆన్ ది జనరేషన్ ఆఫ్ ఆనిమల్స్" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. ఈ పుస్తకం ప్రతులు అతి త్వరిత గతిలో అమ్ముడైపోయి కొత్త చరిత్రను సృష్టించాయి. హార్వే 1657 సంవత్సరం జూన్ 3 న మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం ధరలు స్థిరం

## వెండి రేట్లలోనూ మార్పులేదు

**హైదరాబాద్, జూన్ 2 :** పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిచ్చే పరిస్థితులు కొనసాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మంగళవారం స్థిరంగా నమోదయ్యాయి. సోమవారం భారీగా తగ్గిన ధరలు ఈ రోజు ఎలాంట మార్పు లేకుండా కొనసాగడం కొనుగోలుదారులకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. సోమవారం 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధరపై రూ.820 తగ్గగా, 22 క్యారెట్ల బంగారంపై రూ.750, 18 క్యారెట్ల బంగారంపై రూ.610 తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల కదలికలు, డాలర్ మారకపు విలువల్లో మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోలు ధోరణులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,220 వద్ద కొనసాగుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,200గా ఉండగా, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,17,170 వద్ద స్థిరంగా ఉంది రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, వరంగల్, ఖమ్మం, కడప, అనంతపురం వంటి ప్రాంతాల్లోనూ ధరల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. దీంతో ఇటీవల ధరలు మరింత పెరుగుతాయేమోనని ఎదురుచూస్తున్న వినియోగదారులు ప్రస్తుతం కొనుగోళ్లపై దృష్టి సారిస్తున్నారు. ఇక వెండి ధరల విషయానికి వస్తే, మంగళవారం వెండి రేట్లు కూడా స్థిరంగానే కొనసాగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి ధర రూ.29 వేల వద్ద ఉండగా, కిలో వెండి ధర రూ.2.90 లక్షలుగా నమోదైంది. గత కొన్ని రోజులుగా వెండి ధరల్లో కూడా పెద్దగా హెచ్చుతగ్గులు కనిపించకపోవడం గమనార్హం. వచ్చే రోజుల్లో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, అమెరికా వడ్డీ రేట్ల నిర్ణయాలు, డాలర్ బలహీనత లేదా బలపాటు, భౌగోళిక రాజకీయ పరిణామాలు బంగారం, వెండి ధరల దిశను నిర్ణయించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ధరలు స్థిరంగా ఉండటంతో ఆభరణాల కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న వినియోగదారులకు ఇది అనుకూల సమయంగా భావిస్తున్నారు.

# వాణిజ్య గ్యాస్ ధరల మోత.. సామాన్యులకు మాత్రం ఊరట

**న్యూఢిల్లీ, జూన్ 2 :** దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ద్రవీభవన పెట్రోలియం వాయువు సిలిండర్ల ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం లభించింది. కొత్త ధరలు జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. తాజా సవరణల ప్రకారం రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరపై రూ.42 పెంపు జరిగింది. దీంతో ఒక్కో సిలిండర్ ధర రూ.3,113.50కు చేరుకుంది. కోల్‌కతాలో రూ.53.50 పెరగడంతో అక్కడి ధర రూ.3,255.50కు చేరింది. ముంబై, చెన్నై, హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ధరలను పెంచారు. అలాగే ఐదు కిలోల స్వేచ్ఛా వాణిజ్య సిలిండర్ ధరను రూ.11 పెంచడంతో ఢిల్లీలో అది రూ.821.50కు చేరింది. అయితే గృహ వినియోగదారులకు ఉపయోగపడే సబ్సిడీ, సాధారణ వంటగ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అంతర్జాతీయ విమానయాన రంగానికి ఊరటనిస్తూ విమాన టర్బైన్ ఇంధనం ధరలను సుమారు 2.7 శాతం మేర తగ్గించారు. ఈ తగ్గింపు ప్రధానంగా విదేశీ విమాన సర్వీసులకు వర్తించనుంది. అయితే దేశీయ విమానయాన సంస్థలకు వర్తించే ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన నిల్వలను బలోపేతం చేసేందుకు ఈ ధరల సవరణలు చేపట్టినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా భద్రత వంటి అంశాలు కూడా ఈ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరల పెంపు ప్రభావం ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు మరియు చిన్న ఆహార వ్యాపారాలపై పడే అవకాశం ఉంది. వారి నిర్వహణ వ్యయాలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం కనిపించే అవకాశముందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరలు యథాతథంగా ఉండటం వల్ల సామాన్య కుటుంబాలకు మాత్రం తక్షణ భారం తప్పిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# మారుతీకి రికార్డు అమ్మకాలు



**న్యూఢిల్లీ, జూన్ 2 :** దేశీయ ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న మారుతీ సుజుకీ ఇండియా మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. గత మే నెలలో సంస్థ చరిత్రలోనే అత్యధిక నెలవారీ వాహన విక్రయాలను నమోదు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అన్ని విభాగాల వాహనాలను కలిపి మొత్తం 2 లక్షల 42 వేల 688 యూనిట్ల విక్రయాలు సాధించడం ద్వారా భారతీయ వాహన రంగంలో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. భారతదేశంలో ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొన్నప్పటికీ, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మారుతీ సుజుకీ ఈ స్థాయి అమ్మకాలు సాధించడం విశేషంగా మారింది. ముఖ్యంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా ఉండే ప్రయాణికుల కార్లు, క్రీడోపయోగ వాహనాలు, బహుళ ప్రయోజన వాహనాలకు మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్ ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. విక్రయాల గణాంకాలను పరిశీలిస్తే, చిన్న కార్లు మరియు సెడాన్ విభాగంలో మారుతీకి చెందిన ప్రముఖ నమూనాలు అత్యధిక ఆదరణ పొందాయి. బాలెనో, స్విఫ్ట్, డిజైర్, వాగన్ ఆర్ వంటి ప్రజాదరణ పొందిన కార్లు కలిపి 1 లక్ష 90 వేల 337 యూనిట్ల విక్రయాలను నమోదు చేశాయి. మధ్యతరగతి కుటుంబాలకు అనువైన ధరలు, అధిక ఇంధన సామర్థ్యం, తక్కువ నిర్వహణ ఖర్చు, విశ్వసనీయ పనితీరు వంటి అంశాలు ఈ కార్లకు భారీ డిమాండ్ తీసుకువచ్చాయి. ఇక క్రీడోపయోగ వాహనాల విభాగంలో కూడా సంస్థ దూసుకుపోయింది. బ్రెజా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎక్స్ఎల్-6, జిమ్నీ వంటి వాహనాలు వినియోగదారులను ఆకట్టుకున్నాయి. ఈ విభాగంలో మొత్తం 79 వేల 267 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఆధునిక సాంకేతికత, ఆకర్షణీయమైన రూపకల్పన, మెరుగైన భద్రతా సదుపాయాలు, కుటుంబ ప్రయాణాలకు అనువైన విశాలమైన అంతర్గత స్థలం ఈ వాహనాల విజయానికి బలంగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు విస్తరించిన విక్రయ కేంద్రాలు, సేవా కేంద్రాల వ్యవస్థ కూడా సంస్థ విజయానికి ముఖ్య కారణంగా నిలుస్తోంది. వాహనం కొనుగోలు చేసిన తర్వాత కూడా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా మారుతీ మార్కెట్లో విశ్వాసాన్ని పెంచుకుంది. విడిభాగాల సులభ లభ్యత, తక్కువ నిర్వహణ వ్యయం, అధిక పునర్విక్రయ విలువ వంటి అంశాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. దేశీయ వాహన పరిశ్రమలో వినియోగదారుల అభిరుచులు మారుతున్నప్పటికీ, వాటికి అనుగుణంగా కొత్త నమూనాలను ప్రవేశపెడుతూ మారుతీ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. సాంకేతికత, నాణ్యత, వినియోగదారుల అవసరాల మధ్య సమతుల్యతను పాటించడం సంస్థ విజయ రహస్యంగా పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. మే నెలలో నమోదైన ఈ చారిత్రక విక్రయాలు సంస్థ భవిష్యత్ వృద్ధికి మరింత బలాన్ని చేకూర్చనున్నాయి. పండుగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, కొత్త వాహనాల కొనుగోళ్లపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతుండటంతో రాబోయే నెలల్లో కూడా మారుతీ సుజుకీ మరిన్ని రికార్డులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# యూపీఐతో పీఎఫ్ డబ్బులు క్షణాల్లోనే ఖాతాలోకి!




**న్యూఢిల్లీ, జూన్ 2 :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కలిగించే శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది పీఎఫ్ ఖాతాదారులు ఇకపై తమ భవిష్య నిధి ఖాతాల్లోని అర్హత ఉన్న మొత్తాన్ని యూపీఐ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసుకునే అవకాశం పొందనున్నారు. ఈ కొత్త వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని, త్వరలోనే సేవలను ప్రారంభించనున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా వెల్లడించారు. ప్రస్తుతం పీఎఫ్ ఖాతా నుంచి నగదు ఉపసంహరించుకోవాలంటే దరఖాస్తు ప్రక్రియ, పరిశీలన, ఆమోదం వంటి దశల కారణంగా పలుమార్లు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ముఖ్యంగా పెద్ద మొత్తాల ఉపసంహరణకు అదనపు ధ్రువీకరణ అవసరమవుతుండటంతో జాప్యాలు ఎదురవుతున్నాయి. కొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలకు ముగింపు పలకాలని అధికారులు భావిస్తున్నారు. పూర్తిగా డిజిటల్ విధానంలో సభ్యులు తమ ఖాతాలోని అర్హత ఉన్న మొత్తాన్ని కేవలం కొన్ని నిమిషాల్లోనే పొందగలుగుతారు. ఈ కొత్త సేవను భవిష్య నిధి సంస్థ మూడో దశ డిజిటల్ సంస్కరణల్లో భాగంగా అమలు చేయనుంది. సభ్యులు తమ మొబైల్‌లో ఉన్న ప్రభుత్వ సేవల వేదిక ద్వారా ఖాతాలో అందుబాటులో ఉన్న అర్హత మొత్తాన్ని పరిశీలించగలరు. అనంతరం యూపీఐ ఆధారిత ధ్రువీకరణ పూర్తి చేసి, ఆ మొత్తాన్ని తమ బ్యాంకు ఖాతాకు తక్షణమే బదిలీ చేసుకోవచ్చు. డబ్బు జమ అయిన వెంటనే యూపీఐ లావాదేవీలు, నగదు ఉపసంహరణలు లేదా ఇతర అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. అనారోగ్యం, పిల్లల విద్య, వివాహం, గృహ నిర్మాణం వంటి అత్యవసర అవసరాల కోసం సభ్యులు వెంటనే నిధులు పొందగలగడం ఈ విధానం ప్రధాన ప్రయోజనంగా భావిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో డబ్బు కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకపోవడం ఉద్యోగులకు పెద్ద ఉపశమనం కలిగించనుంది. అయితే ఈ సదుపాయాన్ని పొందాలంటే కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. సభ్యుడికి చెల్లుబాటు అయ్యే యూనివర్సల్ అకౌంట్ నంబర్ ఉండాలి. ఆ ఖాతాకు ఆధార్, పాన్ కార్డులు అనుసంధానమై ధ్రువీకరణ పూర్తై ఉండాలి. అలాగే భవిష్య నిధి రికార్డుల్లో ఉన్న పేరు, పుట్టిన తేదీ వంటి వివరాలు ఆధార్‌లోని వివరాలతో పూర్తిగా సరిపోవాలి. వివరాల్లో తేడాలు ఉంటే సేవలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. భవిష్య నిధి ఖాతాలోని మొత్తం సొమ్మును ఒకేసారి ఉపసంహరించుకునే అవకాశం మాత్రం ఉండదు. ఉద్యోగి భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఖాతాలోని కొంత మొత్తం శాశ్వతంగా భద్రపరుస్తారు. మిగిలిన అర్హత ఉన్న భాగాన్ని మాత్రమే సభ్యులు యూపీఐ ద్వారా పొందగలరు. సభ్యుల సేవలను మరింత సులభతరం చేయడానికి భవిష్య నిధి సంస్థ త్వరలో వాట్సాప్ ఆధారిత సమాచార సేవను కూడా అందుబాటులోకి తీసుకురానుంది. దీని ద్వారా సభ్యులు తమ ఖాతా నిల్వ, ఉపసంహరణ అర్హత, దరఖాస్తుల స్థితి వంటి వివరాలను కేవలం ఒక సందేశంతో తెలుసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ చర్యలతో భవిష్య నిధి వ్యవస్థను పూర్తిగా డిజిటల్, పారదర్శక మరియు వేగవంతమైన సేవా వేదికగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# మార్కెట్లు జోష్‌లో ముగింపు

**ముంబై, జూన్ 2 :** భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. సమాచార సాంకేతిక, లోహాలు, వినియోగ వస్తువుల రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో ప్రధాన సూచీలు సానుకూలంగా కదిలాయి. అయితే భారత్-అమెరికా మధ్య జరుగుతున్న కీలక వాణిజ్య చర్చల నేపథ్యంలో పెట్టుబడిదారులు జాగ్రత్త ధోరణిని కొనసాగించారు. రోజంతా లాభనష్టాల మధ్య సాగిన ట్రేడింగ్ అనంతరం ముంబై స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 382.50 పాయింట్లు పెరిగి 74,649.84 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ మార్కెట్ సూచీ నిఫ్టీ 100.95 పాయింట్లు లాభపడి 23,483.55 వద్ద స్థిరపడింది. ప్రధానంగా సమాచార సాంకేతిక రంగానికి చెందిన కంపెనీల షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్‌లో సమాచార సాంకేతిక రంగ దిగ్గజాలు, పోర్టు సేవల సంస్థలు, సాంకేతిక సేవల కంపెనీల షేర్లు మంచి లాభాలను నమోదు చేశాయి. మరోవైపు విద్యుత్, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాలకు చెందిన కొన్ని షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయినప్పటికీ మొత్తం మార్కెట్‌పై సానుకూల ప్రభావం కొనసాగింది. పెద్ద కంపెనీలతో పాటు మధ్యతరహా, చిన్నతరహా కంపెనీల షేర్లలో కూడా కొనుగోళ్లు కనిపించాయి. మధ్యతరహా కంపెనీల సూచీ స్వల్ప లాభాలతో ముగియగా, చిన్నతరహా కంపెనీల సూచీ మరింత మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఇది మార్కెట్‌లో పెట్టుబడిదారుల విశ్వాసం కొనసాగుతోందనే సంకేతంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. రంగాల వారీగా పరిశీలిస్తే సమాచార సాంకేతిక రంగం అత్యధిక లాభాలను నమోదు చేసింది. ప్రపంచ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, కృత్రిమ మేధ, డిజిటల్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ రంగంలోని షేర్లకు మద్దతు లభించింది. మరోవైపు ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల షేర్లు మాత్రం స్వల్ప ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీ ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి సమీపంలో ఉంది. సమీప భవిష్యత్తులో ఈ స్థాయిని అధిగమిస్తే మరింత ఎగబాకే అవకాశాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. అదే సమయంలో దిగువ స్థాయిలు కీలక మద్దతు ప్రాంతాలుగా పనిచేసే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ఇక దేశీయ మార్కెట్ల దృష్టి ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలపైనే ఉంది. ఈ చర్చల ఫలితాలు ఎగుమతులు, దిగుమతులు, పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అదనంగా రుతుపవనాల పురోగతి, ద్రవ్యోల్బణ గణాంకాలు, భారతీయ రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్ల నిర్ణయాలు, అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు రానున్న రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలుగా నిలవనున్నాయి. మొత్తంగా చూస్తే, దేశీయ మార్కెట్లు ప్రస్తుతం సానుకూల ధోరణిని కొనసాగిస్తున్నప్పటికీ అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థిక విధానాలపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు మంగళవారం ట్రేడింగ్ స్పష్టంచేసింది.






# డోపింగ్ ఉచ్చులో దీక్ష..

## కామన్‌వెల్త్ ఆశలకు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, జూన్ 2 :** భారత అథ్లెటిక్స్‌కు మరోసారి డోపింగ్ వివాదం షాక్ ఇచ్చింది. దేశానికి చెందిన ప్రముఖ మధ్యదూర పరుగుల క్రీడాకారిణి కేఎం దీక్ష డోపింగ్ పరీక్షలో చిక్కుకున్నట్లు వెలువడుతున్న వార్తలు క్రీడా వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. 1500 మీటర్ల విభాగంలో జాతీయ రికార్డు హోల్డర్‌గా గుర్తింపు పొందిన దీక్ష శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం ఆనవాళ్లు లభించినట్లు సమాచారం. దీంతో వచ్చే కామన్‌వెల్త్ క్రీడల్లో ఆమె పాల్గొనే అవకాశాలపై అనిశ్చితి నెలకొంది. క్రీడా వర్గాల సమాచారం ప్రకారం, దీక్ష శాంపిల్‌లో స్టానోజోలోల్ అనే నిషేధిత పదార్థం ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ నిషేధిత జాబితాలో ఉన్న ఈ పదార్థం శారీరక సామర్థ్యాన్ని కృత్రిమంగా పెంచే అనబాలిక్ ఏజెంట్‌గా పరిగణించబడుతుంది. ఈ నేపథ్యంలో మే నెల చివరి వారంలో దీక్షకు సంబంధిత అధికారులు నోటీసు పంపినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ఆమెపై అధికారిక సస్పెన్షన్ విధించలేదు. అయినప్పటికీ, డోపింగ్ ఆరోపణలు నిజమని తేలితే దీక్షపై నాలుగేళ్ల వరకు నిషేధం విధించే అవకాశం ఉందని క్రీడా నిపుణులు చెబుతున్నారు. అలా జరిగితే ఆమె కెరీర్‌కు మాత్రమే కాకుండా భారత అథ్లెటిక్స్‌కు కూడా పెద్ద దెబ్బగా మారనుంది. ముఖ్యంగా కామన్‌వెల్త్ క్రీడలకు ముందు ఈ వివాదం తలెత్తడం భారత బృందానికి ఆందోళన కలిగిస్తోంది. దీక్ష గత ఏడాది అమెరికాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలో అద్భుత ప్రదర్శన కనబరిచి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. 1500 మీటర్ల రేసును 4 నిమిషాల 4.78 సెకన్లలో పూర్తి చేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఆ ప్రదర్శనతో అంతర్జాతీయ స్థాయిలోనూ ఆమె పేరు మార్మోగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైపూర్‌లో జరిగిన భారత అథ్లెటిక్స్ సిరీస్‌లో స్వర్ణ పతకం సాధించిన తర్వాత ఆమె ఎలాంటి పోటీల్లోనూ పాల్గొనలేదు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ అథ్లెటిక్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న దీక్ష ఇటీవల అక్కడి నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం డోపింగ్ ఆరోపణలపై ఆమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అలాగే ఆమె కోచ్ కూడా ఈ వ్యవహారంపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. డోపింగ్ కేసులు భారత క్రీడారంగాన్ని తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్న తరుణంలో దీక్ష వ్యవహారం మరోసారి క్రీడాకారులపై పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాల అవసరాన్ని గుర్తుచేస్తోంది. విచారణ పూర్తయ్యే వరకు అధికారిక నిర్ణయం వెలువడకపోయినా, ఈ వ్యవహారం భారత అథ్లెటిక్స్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




# ఢిల్లీలో ఆఫ్ఘన్ 'హోమ్' సిరీస్

**న్యూఢిల్లీ, జూన్ 2 :** క్రికెట్ చరిత్రలో అరుదైన ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. ఆఫ్ఘనిస్థాన్ జట్టు తొలిసారిగా భారత జట్టుకు ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే ఈ 'హోమ్' సిరీస్‌కు వేదిక కూడా భారతదేశమే కావడం విశేషం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మూడు ట్వంటీ-20 మ్యాచ్‌ల సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో ఈ సిరీస్ సాధ్యమవుతోంది. పరస్పర పర్యటనల ఒప్పందంలో భాగంగా ఆఫ్ఘనిస్థాన్ చేసిన ప్రతిపాదనకు భారత బోర్డు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. గతంలో కూడా ఇతర దేశాల క్రికెట్ బోర్డులకు సహకారంగా భారత బోర్డు ఇలాంటి సిరీస్‌ల నిర్వహణకు మద్దతు ఇచ్చింది. ఈ సిరీస్ కోసం ఢిల్లీని వేదికగా ఖరారు చేయడంలో భారత బోర్డు కీలక పాత్ర పోషించింది. సెప్టెంబర్ 13, 16, 19 తేదీల్లో మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మ్యాచ్‌ల నిర్వహణ కోసం స్థానిక క్రికెట్ సంఘం తమ దేశీయ టోర్నీ షెడ్యూల్‌లో కూడా మార్పులు చేయడానికి సిద్ధమవుతోంది. స్వదేశంలో రాజకీయ, భద్రతా పరిస్థితుల కారణంగా ఆఫ్ఘనిస్థాన్ గత పదేళ్లుగా తమ అంతర్జాతీయ 'హోమ్' మ్యాచ్‌లను భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహిస్తోంది. గతంలో ఐర్లాండ్, బంగ్లాదేశ్ జట్లతో జరిగిన పలు సిరీస్‌లకు కూడా భారత నగరాలే వేదికలయ్యాయి. ఇదిలా ఉండగా, ఈ ట్వంటీ-20 సిరీస్‌కు ముందే ఆఫ్ఘనిస్థాన్ జట్టు మరోసారి భారత్‌కు రానుంది. జూన్ 6 నుంచి 20 వరకు ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొననుంది. జూన్ 6వ న్యూ చండీగఢ్‌లో ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుండగా, జూన్ 14, 17, 20 తేదీల్లో వరుసగా ధర్మశాల, లక్నో, చెన్నై వేదికలుగా వన్డే మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ రెండు ఫార్మాట్లలోనూ హష్మతుల్లా షాహిదీ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు.

# ఐదు టైటిళ్ల ఘనత సాధించిన కృనాల్




**బెంగళూరు, జూన్ 2 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆటగాళ్ల జాబితాలో ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలవడంతో కృనాల్ తన కెరీర్‌లో ఐదో ఐపీఎల్ టైటిల్‌ను అందుకున్నాడు. దీంతో ఐదు లేదా అంతకంటే ఎక్కువ ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన అత్యంత అరుదైన ఆటగాళ్ల సరసన నిలిచాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యధిక టైటిళ్లు గెలిచిన ఆటగాళ్లలో రోహిత్ శర్మ, అంబటి రాయుడు చెరో ఆరు ట్రోఫీలతో అగ్రస్థానంలో ఉన్నారు. వారి తర్వాత ఐదు టైటిళ్లతో మహేంద్ర సింగ్ ధోనీ, హార్దిక్ పాండ్యా, కీరన్ పొలార్డ్, జస్ప్రీత్ బుమ్రా ఉన్నారు. ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో కృనాల్ పాండ్యా కూడా చేరి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ముంబై ఇండియన్స్ తరఫున 2017, 2019, 2020 సీజన్లలో మూడు టైటిళ్లు గెలిచిన కృనాల్, ఆ తర్వాత బెంగళూరు జట్టులో చేరి 2025, 2026 సీజన్లలో మరో రెండు ట్రోఫీలు అందుకున్నాడు. 2025లో బెంగళూరు జట్టులో చేరిన తర్వాత కృనాల్ ప్రదర్శన జట్టుకు ఎంతో ఉపయోగపడింది. గత సీజన్ ఫైనల్లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన అతడు, ఈ సీజన్‌లో కూడా ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో 226 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో 14 వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచి విజయంలో తన వంతు పాత్రను సమర్థంగా నిర్వర్తించాడు. ఈ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన మూడో జట్టుగా నిలిచింది. ఇంతకుముందు ఈ ఘనతను ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మాత్రమే సాధించాయి. బెంగళూరు జట్టు ఇప్పుడు ఆ రెండు దిగ్గజ జట్ల సరసన చోటు సంపాదించుకుంది. మ్యాచ్ అనంతరం స్పందించిన కృనాల్ పాండ్యా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నాడు. ప్రతి ఐపీఎల్ ట్రోఫీ తనకు ఎంతో ప్రత్యేకమని, వాటిలో ఏదీ మరొకదానికంటే ఎక్కువ కాదని పేర్కొన్నాడు. పదకొండు సంవత్సరాల కెరీర్‌లో ఐదు టైటిళ్లు గెలవడం తన జీవితంలో మరపురాని ఘట్టమని తెలిపాడు. కష్టకాలాల్లోనూ జట్టుకు అండగా నిలిచిన అభిమానులకే ఈ విజయాన్ని అంకితం చేస్తున్నట్లు భావోద్వేగంగా వెల్లడించాడు. కృషి, పట్టుదల, జట్టుపై అంకితభావం ఉంటే ఎలాంటి విజయాలైనా సాధించవచ్చని కృనాల్ మరోసారి నిరూపించాడు. ఐదు ఐపీఎల్ టైటిళ్లతో అతడు ఇప్పుడు లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆల్‌రౌండర్లలో ఒకడిగా నిలిచిపోయాడు.

# ఒక్క పరుగుతో ఐర్లాండ్ సంచలనం

**డబ్లిన్, జూన్ 2 :** మహిళల అంతర్జాతీయ ట్వంటీ-20 క్రికెట్‌లో ఐర్లాండ్ జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ విధానం ప్రకారం ఒక్క పరుగుతో విజయం సాధించింది. మహిళల ట్వంటీ-20ల్లో వెస్టిండీస్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ గెలుపుతో ఫైనల్ అవకాశాలను కూడా ఐర్లాండ్ సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఒక పరుగు మాత్రమే చేసి నిరాశపరిచింది. టేలర్, డాటిన్ వంటి అనుభవజ్ఞులూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. 43 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును షెమైన్ క్యాంప్‌బెల్ ఆదుకుంది. ఆమె కీలక ఇన్నింగ్స్ ఆడగా, చివర్లో గ్లాస్గో వేగంగా పరుగులు సాధించి జట్టుకు పోటీ స్కోరు అందించింది. 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ అసాధారణ పోరాటం చేసింది. ఆమె దూకుడైన బ్యాటింగ్‌తో జట్టును విజయపథంలో నడిపించింది. 14.1 ఓవర్లకు ఐర్లాండ్ 95 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దశలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. ఆ సమయంలో డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ లెక్కల ప్రకారం ఐర్లాండ్ లక్ష్యానికి మూడు పరుగులు వెనుకబడి ఉంది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే పరిస్థితి రావడంతో ఐర్లాండ్ బ్యాటర్లు కనీసం ఒక బంతి అయినా ఆడాలని పట్టుబట్టారు. అనంతరం జరిగిన కీలక బంతిని లూయిస్ లిటిల్ బౌండరీకి తరలించాడు. అదే మ్యాచ్



మలుపు తిప్పింది. వెంటనే వర్షం మళ్లీ తీవ్రంగా కురవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ సమయానికి డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ విధానం ప్రకారం ఐర్లాండ్ ఒక పరుగు ఆధిక్యంలో ఉండటంతో విజేతగా ప్రకటించారు. ఐర్లాండ్ కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ 46 బంతుల్లో 71 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయానికి ప్రధాన కారణమైంది. బౌలింగ్‌లోనూ కీలక పాత్ర పోషించి సర్వతోముఖ ప్రతిభను కనబరిచింది. ఆమె ప్రదర్శన మ్యాచ్ గెలుపులో నిర్ణాయకంగా మారింది. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఐర్లాండ్, వెస్టిండీస్, పాకిస్థాన్ మహిళల జట్లు పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఐర్లాండ్, వెస్టిండీస్ జట్లకు సమానంగా నాలుగు పాయింట్లు ఉన్నప్పటికీ మెరుగైన నెట్ రన్‌రేట్ కారణంగా వెస్టిండీస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఇంకా మిగిలిన మ్యాచ్‌లు ఉండటంతో ఫైనల్‌కు చేరే పోరు మరింత ఆసక్తికరంగా మారింది.

# వైభవ్ విజయంపై ఐఐఎం అధ్యయనం

**ఇండోర్, జూన్ 2 :** చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభతో క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల దృష్టిని కూడా ఆకర్షించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఒత్తిడిని జయిస్తూ అత్యున్నత స్థాయిలో రాణించిన అతడి విజయ రహస్యాలను తెలుసుకునేందుకు ఇండోర్ భారతీయ నిర్వహణ సంస్థ ప్రత్యేక అధ్యయనాన్ని ప్రారంభించింది. 'వైభవ్ నమూనా' పేరుతో చేపట్టనున్న ఈ పరిశోధనలో క్రీడలు, మనస్తత్వ శాస్త్రం, నిర్వహణ రంగాల నిపుణులు కలిసి పనిచేయనున్నారు. ఒక యువ క్రీడాకారుడి ఎదుగుదలపై దేశంలోనే ఈ తరహా బహుముఖ అధ్యయనం జరగడం విశేషంగా మారింది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో రాజస్థాన్ జట్టు తరఫున బరిలోకి దిగిన వైభవ్ తన దూకుడు బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. మొత్తం 16 ఇన్నింగ్స్‌ల్లో 48.50 సగటుతో 776 పరుగులు సాధించి టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అంతేకాకుండా 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ఒకే సీజన్‌లో 72 సిక్సర్లు బాదుతూ, ఎన్నో సంవత్సరాలుగా నిలిచిన రికార్డును అధిగమించాడు. అతడి అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా సీజన్‌లో ఉత్తమ యువ ఆటగాడు, అత్యుత్తమ దూకుడు బ్యాటర్ అవార్డులు కూడా వరించాయి. ఈ నేపథ్యంలో వైభవ్ సాధించిన విజయాల వెనుక ఉన్న మానసిక, సామాజిక, కుటుంబ, శిక్షణ సంబంధిత అంశాలను లోతుగా




పరిశీలించాలని అధ్యయన బృందం నిర్ణయించింది. చిన్న వయసులోనే అంతటి ఒత్తిడిని ఎలా తట్టుకున్నాడు? అత్యున్నత స్థాయిలో నిలదొక్కుకునేందుకు ఎలాంటి అలవాట్లు, క్రమశిక్షణ, మద్దతు వ్యవస్థలు దోహదపడ్డాయి? వంటి అంశాలపై పరిశోధన సాగనుంది. ప్రతిభ ఒక్కటే విజయానికి సరిపోదని, కుటుంబ సహకారం, మార్గదర్శకుల ప్రోత్సాహం, కఠోర శ్రమ, మానసిక స్థైర్యం వంటి అంశాలు కలిసి విజేతను తయారు చేస్తాయని నిపుణులు భావిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా వైభవ్ కుటుంబ సభ్యులు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, క్రీడా మానసిక నిపుణులతో కూడా మాట్లాడనున్నారు. ఒక యువ క్రీడాకారుడు అత్యధిక అంచనాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, ప్రజాదరణ వల్ల వచ్చే ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాడనే అంశాలను కూడా విశ్లేషించనున్నారు. ప్రస్తుతం యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి పరిస్థితుల్లో ఈ పరిశోధన విలువైన సూచనలు అందించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ అధ్యయనం ద్వారా వెలువడే నివేదిక భవిష్యత్‌లో క్రీడాకారుల శిక్షణా విధానాలు, ప్రతిభావంతుల గుర్తింపు కార్యక్రమాలు, విద్యాసంస్థలు అనుసరించే మార్గదర్శకాలకు ఉపయోగపడే అవకాశముంది. అలాగే కార్పొరేట్ రంగంలో ప్రతిభ నిర్వహణ, నాయకత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలకూ ఈ అధ్యయనం కీలక పాఠాలు అందించనుందని పరిశోధకులు చెబుతున్నారు. వైభవ్ సూర్యవంశీ విజయగాథ కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా, అసాధారణ ప్రతిభను ఎలా సంరక్షించాలి, ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలపై దేశానికి ఒక కొత్త దిశను చూపించబోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చురకలు





# పసుపు రంగు దుస్తుల్లో మెరిసిన తమన్నా

దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి తమన్నా భాటియా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పసుపు రంగు మాక్సీ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సాధారణతకు, హుందాతనానికి ప్రాధాన్యత ఇస్తూ ఆమె ఎంచుకున్న ఈ దుస్తులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమ య్యాయి. లేత పసుపు రంగులో రూపొందిన ఈ దుస్తులు వేసవి కాలానికి అనువుగా ఉండటమే కాకుండా, తమన్నా వ్యక్తిత్వానికి మరింత అందాన్ని చేకూర్చాయి. భుజాలపై సున్నితంగా అమర్చిన పట్టీలు, శరీరాకృతికి సరిపోయే విధంగా రూపొందించిన పైభాగం, కిందికి వెళ్లే కొద్దీ అలల మాదిరిగా కనిపించే పొరలు ఈ దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నడుస్తున్న సమయంలో దుస్తులు అందించే సహజమైన కదలిక ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని జోడించింది. తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు తమన్నా సాదాసీదా శైలినే ఎంచుకుంది. అతిగా అలంకరణలకు దూరంగా ఉంటూ, సున్నితమైన మేకప్‌తో సహజమైన అందాన్ని ప్రతిబింబించింది. అలాగే సాధారణ హెయిర్ స్టైల్‌తో తన మొత్తం రూపాన్ని సమతుల్యంగా మలిచింది. ఆమె ధరించిన ఆభరణాలు కూడా అధిక ఆడంబరానికి దూరంగా ఉండి, క్లాసిక్ శైలిని ప్రతిబింబించాయి. నటనతో పాటు వ్యాపార రంగంలోనూ తమన్నా విజయవంతంగా ముందుకు సాగుతోంది. 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' పేరుతో ఆమె ప్రారంభించిన ఆభరణాల వ్యాపారం క్రమంగా విస్తరిస్తోంది. ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వజ్రాభరణాలను వివిధ కార్యక్రమాల్లో ధరించడం ద్వారా ఆమె తన బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకువస్తోంది. ఒక నటిగా కాకుండా, మహిళా వ్యాపారవేత్తగా కూడా ప్రతిభను చాటుకుంటోంది. సినిమాల విషయానికి వస్తే, తమన్నా ప్రస్తుతం పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉంది. విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలను ఎంపిక చేసుకుంటూ తన నటనా ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. వాణిజ్య చిత్రాలతో పాటు కొత్త తరహా పాత్రలను కూడా స్వీకరిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఫ్యాషన్, వ్యాపారం, నటన అనే మూడు రంగాల్లోనూ సమానంగా రాణిస్తూ తమన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. ప్రతి సందర్భంలోనూ తన అభిరుచి, ఆత్మవిశ్వాసం, హుందాతనాన్ని ప్రతిబింబిస్తూ ఆమె యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఆమె తాజా చిత్రాలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, ఆమె స్టైల్ మరియు వ్యక్తిత్వంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



# మ్యాజికల్ మే అంటూ త్రిష పోస్ట్..

స్టార్ హీరోయిన్ త్రిష తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తనకు ఎంతో ఇష్టమైన 'మ్యాజికల్ మే' నెల జ్ఞాపకాలను, ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. "40 ఏళ్ల వయసులో 25 ఏళ్ల అమ్మాయిలా కనిపించడం గొప్ప కాదు.. 20 ఏళ్ల వయసులో ఉన్న యువతులు 40 ఏళ్ల ప్రాయాన్ని చూసి భయపడకుండా, ఆ వయసు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేలా చేయడమే నా లక్ష్యం" అనే వ్యాఖ్యను కూడా జత చేశారు. దీంతో అది చూసిన వారంతా విజయ్ సీఎం అవ్వడంతో మ్యాజికల్ మే అని క్యాప్షన్ పెట్టారని చర్చించుకుంటున్నారు. వీరి రిలేషన్‌పై ఈ పోస్ట్‌తో హింట్ ఇచ్చారని అంటున్నారు.



# దీపికాకు జాన్వీ స్ట్రాంగ్ కౌంటర్?

సినిమా పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత చర్చనీయమైన అంశాల్లో వర్క్ కల్చర్ ఒకటి. ముఖ్యంగా బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీల్లో పని గంటలు, షూటింగ్ విధానం, ఆర్టిస్టులపై ఉండే ఒత్తిడి వంటి అంశాలపై తరుచు చర్చ జరుగుతునే ఉంటుంది. అయితే, ఈ చర్చకు కేంద్రబిందువుగా నిలిచింది బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె. స్పిరిట్, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్టుల నుంచి ఆమె తప్పుకున్నారనే వార్తలు వచ్చిన తర్వాత.. పని గంటల వివాదం ఇండస్ట్రీ మొత్తం చర్చనీయంగా మారుతుంది. దీపికా పదుకొణె రోజుకు పరిమిత గంటలే పని చేయాలనే నిబంధన పెట్టారని, షూటింగ్ షెడ్యూల్స్ విషయంలో కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో టాలీవుడ్ వర్క్ కల్చర్‌పై రకరకాల కథనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు షూటింగ్‌లు జరుగుతాయని, ఆర్టిస్టులపై భారీ ఒత్తిడి ఉంటుందని కొందరు వ్యాఖ్యానించారు. అయితే, ఈ వివాదంపై తాజాగా బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు కొత్త మలుపు తిప్పాయి.'దేవర' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె టాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాలను పంచుకుంది. తెలుగు సినిమా సెట్స్‌లో సమయపాలనకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, పనిగంటలను చాలా క్రమబద్ధంగా ప్లాన్ చేస్తారని ఆమె వెల్లడించింది. నటీనటులతో పాటు టెక్నీషియన్ల సంక్షేమాన్ని కూడా ఇక్కడ ఎంతో గౌరవిస్తారని పేర్కొంది. జాన్వీ మాటల్లో చెప్పాలంటే.. టాలీవుడ్‌లో లంచ్ బ్రేక్ అనేది కేవలం పేరుకే ఉండదట. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రత్యేక సమయం కేటాయిస్తారట. ఆ తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొనడం వల్ల పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. అంతేకాకుండా దేవర, పెద్ది సినిమాల షూటింగ్ సమయంలో తాను రోజుకు 9 గంటలకు మించి ఎప్పుడూ పని చేయలేదని స్పష్టం చేసింది.



# 'మస్సా మస్సా' సందడి

## 'పెద్ది'పై అంచనాలు మరింత పెంచిన శక్తివంతమైన పాట!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందించిన ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమైంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన 'మస్సా మస్సా' పూర్తి వీడియో పాట అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. విశాల్ మిశ్రా ఆలపించిన ఈ పాటలో గ్రామీణ వాతావరణం, కుస్తీ పోటీలు, కఠిన సాధన, లక్ష్యసాధన కోసం కథానాయకుడు చేసే పోరాటాన్ని ప్రభావవంతంగా ఆవిష్కరించారు. ఈ పాటలో రామ్ చరణ్ చూపించిన శారీరక మార్పు, కుస్తీ కోసం చేసిన కఠోర శ్రమ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శక్తివంతమైన హావభావాలు, గ్రామీణ యువకుడి రూపంలో కనిపించిన తీరు అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణ యువకుడు జీవితంలోని సవాళ్లను అధిగమించి తన లక్ష్యాన్ని చేరుకునే ప్రయాణాన్ని ఈ పాట ప్రతిబింబిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని కేవలం క్రీడా నేపథ్య కథగా కాకుండా భావోద్వేగాలు, ప్రేరణాత్మక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కించినట్లు ఇప్పటికే వెల్లడించారు. తాజాగా విడుదలైన ఈ పాట కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. చిత్రంలో కథానాయకుడి పాత్ర ఎంత బలంగా ఉండబోతోందో ఈ పాట ద్వారా మరోసారి అర్థమవుతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన 'మస్సా మస్సా' పాట మాత్రం చిత్రంపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది.



# బోయపాటి, వెంకటేష్ కాంబోలో కొత్త సినిమా!

దర్శకుడు బోయపాటి శ్రీను, వెంకటేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తులసి' సినిమా సూపర్ హిట్ అయింది. ప్రస్తుతం వెంకటేష్ త్రివిక్రమ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు పూర్తయిన తర్వాత బోయపాటితో సినిమాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బోయపాటి శ్రీను తన కెరీర్‌లో భారీ విజయాన్ని సాధించి, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.

# తాప్సీ అందాల హవా..

## సోషల్ మీడియాలో మళ్లీ సందడి

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని, అనంతరం హిందీ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగిన తాప్సీ పన్ను మరోసారి వార్తల్లో నిలిచింది. అందం, అభినయం, విభిన్న పాత్రల ఎంపికతో ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న ఈ నటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తన తాజా చిత్రాలతో ఆకట్టుకుంటోంది. 2010లో విడుదలైన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తాప్సీ తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందింది. సహజమైన నటన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో యువతలో ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంది. ఆ తర్వాత 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'గుండెల్లో గోదారి', 'సాహసం', 'ఆనందో బ్రహ్మ' వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకుంది. తెలుగు చిత్రాల్లో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ, తాప్సీ తన కెరీర్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది. వాణిజ్య చిత్రాలతో పాటు కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంపిక చేసుకుంటూ నటిగా తన ప్రత్యేకతను నిరూపించుకుంది. 'పింక్', 'బేబీ', 'ది ఘాజీ అటాక్', 'నామ్ షబానా', 'ముల్క్', 'బద్లా', 'మిషన్ మంగళ్', 'తప్పడ్', 'సాండ్ కీ ఆంఖ్', 'హసీన్ దిల్‌రుబా', 'డుంకీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో రూపొందిన చిత్రాల్లో ఆమె నటనకు విశేష ఆదరణ లభించింది. ప్రస్తుతం కూడా తాప్సీ చేతిలో పలు భారీ చిత్రాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు అగ్ర హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు మహిళా కేంద్రిత కథలను ప్రోత్సహిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ తాప్సీ చురుకుగా ఉంటుంది. షూటింగ్ విరామ సమయంలో విదేశీ పర్యటనలు చేస్తూ, అక్కడి అందమైన ప్రదేశాల్లో దిగిన చిత్రాలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటోంది. ఆమె పంచుకునే ప్రతి ఫొటో నెట్టింట వైరల్‌గా మారుతోంది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా చిత్రాలు కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సొగసైన దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించిన తాప్సీ, తన ప్రత్యేకమైన చిరునవ్వుతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తూ, ఆమె అందం రోజురోజుకీ మరింత పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. విభిన్న పాత్రలు, బలమైన కథల ఎంపిక, అద్భుతమైన నటనతో భారతీయ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు పొందిన తాప్సీ పన్ను, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com